# గుంటూరు వార్త

## జీఎంసీ కౌన్సిల్ సమావేశంలో ప్రజా సమస్యల పై గళమెత్తిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



9

## పెండింగ్ పనులకు అనుమతులు మంజూరు చేయండి : ఎమ్మెల్యే నసీర్



## ప్రశాంతంగా ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు

**-27699 మందికి గాను 27123 మంది హాజరు -576 మంది గైరు హాజరు**

**గుంటూరు విద్య మార్చి 16 ప్రభాతవార్త :** జిల్లా వ్యాప్తంగా 10వ తరగతి పరీక్షలు సోమవారం నుండి ప్రశాంతంగా



ప్రారంభమయ్యాయి. విద్యార్థులు ఆయా పరీక్ష కేంద్రాలకు అరగంట ముందుగానే చేరుకోవటం వలన ఎక్కడా కూడా లేటుగా పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు ఆలస్యంగా వచ్చిన అంశాలు కనిపించలేదు. పరీక్షా కేంద్రాల వద్దకు విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు కూడా వచ్చి పిల్లలకు మానసిక ధైర్యాన్ని ఇచ్చి పరీక్ష కేంద్రాల్లోనికి పంపిన అంశాలు చాలా చోట్ల కనిపించాయి. తొలి రోజు తెలుగు తత్ సమానమైన లాంగ్వేజ్ పరీక్షలకు 27, 699 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 27, 123 మంది పరీక్షకు హాజరైనట్లు అధికారులు తెలిపారు. 576 మంది గైరు హాజరైనట్లు తెలిపారు. గుంటూరు జిల్లా నోడల్ అధికారి పి పార్వతి ఐదు పరీక్షా కేంద్రాలను, ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ డాక్టర్ కె.వి శ్రీనివాసులు రెడ్డి మంగళగిరిలోని ఒక పరీక్షా కేంద్రాన్ని, గుంటూరు జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ సలీం భాష ఎనిమిది పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ఆకస్మిక తనిఖీ బృందాలు 38 కేంద్రాలను ,రాష్ట్ర పరిశీలకులు 12 పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసినట్లు డిఇఓ డాక్టర్ షేక్ సలీం భాషా తెలిపారు.

## అమరజీవి త్యాగానికి గుర్తింపు స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైజ్

**గుంటూరు మార్చి 16,ప్రభాతవార్తప్రతినిధి :** రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకోగలిగినప్పుడే అమరజీవి పొట్టి శ్రీరాములుకు నిజమైన నివాళి అర్పించినట్టు అవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పొట్టి శ్రీరాములు స్ఫూర్తిని నిరంతరం గుర్తుపెట్టుకుని రాష్ట్రాభివృద్ధి కోసం పని చేయాలని సూచించారు. దీనికి అనుగుణంగానే అమరావతిలో 58 అడుగుల పొట్టి శ్రీరాములు భారీ కాంస్య విగ్రహం ఏర్పాటైందని.. అమరజీవి త్యాగానికి గుర్తుగా ఆయన విగ్రహానికి స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్ పేరు సముచితమని సీఎం అభిప్రాయపడ్డారు. సోమవారం అమరావతిలోని శాఖమూరు పార్కులో పొట్టి శ్రీరాములు 58 అడుగుల భారీ కాంస్య విగ్రహాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా ఈ భారీ విగ్రహావిష్కరణ కార్యక్రమం జరిగింది. పొట్టి శ్రీరాములు 58 రోజుల నిరాహార దీక్షకు గుర్తుగా 58 అడుగుల కాంస్య విగ్రహాన్ని అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ ఏర్పాటు చేసింది. అమరావతిలో తొలి భారీ శిల్పంగా పొట్టి శ్రీరాములు విగ్రహం నిలుస్తుంది. శాఖమూరు పార్కులోని 6.80 ఎకరాల్లో అమరజీవి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. 6 నెలల రికార్డు కాలంలోనే ప్రాజెక్ట్ మొదటి దశ పనులను ట్రస్ట్ పూర్తి చేసింది. ఈ భారీ విగ్రహానికి 26 టన్నుల కాంస్యం, 42 టన్నుల ఐరన్ స్ట్రక్చర్ వినియోగించారు. రెండో దశలో మ్యూజియం, ఆడిటోరియం, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల నిర్మాణాన్ని చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ స్ఫూర్తికి మారు పేరు పొట్టి శ్రీరాములని ఆయన ఒక కులానికి చెందిన వ్యక్తి కాదు అందరివాడని కొనియాడారు. 58 రోజుల నిరాహారదీక్షకు చిహ్నంగా 58 అడుగుల విగ్రహం ఏర్పాటు చేశారని పొట్టి శ్రీరాములు భారీ విగ్రహానికి స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్ అని పేరు పెట్టారన్నారు. స్టాట్యూ ఆఫ్ లిబర్టీ ఉందని.. స్టాట్యూ ఆఫ్ యూనిటీ ఉందని... ఇప్పుడు ఏపీలో స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్ ఉందని తెలిపారు. పొట్టి శ్రీరాములు మెమోరియల్ పార్కును ఆరు నెలల్లో మొదటి దశ పనులు పూర్తి చేశారని పొట్టి శ్రీరాములు త్యాగాన్ని, స్ఫూర్తిని తీసుకోవాలని అన్నారు. తెలుగువారికి గుర్తింపు కూడా లేని రోజుల్లో తెలుగు వారి సత్తా చాటిన వ్యక్తి పొట్టి శ్రీరాములని అన్నారు. మహాత్మా గాంధీ అహింసా సిద్దాంతంలో స్వాతంత్ర్యం తెచ్చారని పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ చేసి రాష్ట్రాన్ని సాధించి పెట్టారని అన్నారు.

## పిజిఆర్ఎస్‌కు 238 అర్జీలు

**గుంటూరు మార్చి 16 ప్రభాత వార్త ప్రతినిధి :**

సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) కార్యక్రమంలో 238 అర్జీలు అందాయి. ఇందులో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన పి.జి.ఆర్.ఎస్ కు 156, గుంటూరు రెవిన్యూ డివిజన్ పరిధిలో 9 అర్జీలు, తెనాలి రెవిన్యూ డివిజన్ పరిధిలో 27 అర్జీలు, గుంటూరు నగర పాలక సంస్థకు 37, మిగిలిన మున్సిపాలిటీల పరిధిలో 9 అర్జీలు అందాయి. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి ప్రజల నుండి ఆర్జీలను స్వీకరించారు. అర్జీదారులు పింఛన్లు, రేషన్ కార్డులు, గృహాలు మంజూరు చేయాలని, వ్యక్తిగత సమస్యల పరిష్కారం చేయాలని కోరుతూ ఆర్జీలను సమర్పించారు. ఈ ఆర్జీలను పరిశీలించి త్వరితగతన పరిష్కారం చేయుటకు చర్యలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి అన్నారు. రెవెన్యూ సమస్యలను రెవిన్యూ క్లినిక్ లలో సమర్పించాలని సూచించారు.



## అమరజీవికి తెలుగుజాతి రుణపడి ఉంటుంది

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, మార్చి16, ప్రభాతవార్త:** తెలుగు మాట్లాడేవారికి ప్రత్యేక రాష్ట్రం కోసం కావాలని కోరుతూ అశువులు బాసిన అమరజీవి పొట్టి శ్రీరాములుకు



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు రుణపడి ఉంటారని ఏఎన్‌యు వీసి ఆచార్య కె.గంగాధరరావు అన్నారు. పొట్టి శ్రీరాములు 125వ జయంతి కార్యక్రమం ఏఎన్‌యులో జరిగింది. ఈ కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నేటియువత ఆయనలోని త్యాగానికి అలవర్చుకోవాలన్నారు. రెక్టార్ ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్ మాట్లాడుతూ తెలుగుజాతి క్యాతికి, సంకల్పానికి, పట్టుదలకు నిదర్శమని పేర్కొన్నారు. ఆయనను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం మాట్లాడుతూ తెలుగు జాతికి వన్నెతెచ్చిన పొట్టి శ్రీరాములు ఆదర్శప్రాయుడన్నారు. ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. తెలుగు, ప్రాచ్య భాషా విభాగం నిర్వహించిన ఈ కార్యక్రమానికి విభాగాధిపతి ఆచార్య ఎన్.వి.కృష్ణారావు అధ్యక్షత వహించారు. ఆయన జీవన నేపథ్యాన్ని వివరించి రాష్ట్రానికి ఆయన చేసిన త్యాగాలను గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ ఆచార్య వీరయ్య, ఆచార్య ఉదయకుమార్, వికాస అధ్యక్ష్య, కార్యదర్శులు ఎన్.ప్రసాద్, జె.శ్రీనివాసరావు, అచ్చిబాబు, తెలుగు విభాగం అధ్యాపకులు డాక్టర్ పిల్లి వాసు, డాక్టర్ బలరాం, డాక్టర్ యశ్వంత్‌రెడ్డి, డాక్టర్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

## త్యాగశీలి పొట్టి శ్రీరాములు

**గుంటూరు కల్చరల్,మార్చి 16,ప్రభాతవార్త :** పొట్టిశ్రీరాములు త్యాగమయ జీవితం పోరాటశీలత,ధృఢచిత్తం,నిస్వార్ధ స్వభావం నేటికి సదాస్మరణీయం అని అవగాహన సంస్థ సభ్యులు నివాళులర్పించారు.అవగాహన సంస్థ కార్యాలయంలో జరిగిన అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమంలో విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య మాట్లాడుతూ భారతీయ ఫెడరల్ రాజ్యాంగ విధానానికి సంబంధించిన ఉత్తమ సూత్రానికి అమరజీవి పొట్టిశ్రీరాములు గొప్పబలం చేకూర్చారన్నారు.తన ఆత్మాహుతితో భాషాప్రాతిపదికపై రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను త్వరితం చేశారన్నారు.అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ శాంతి,హింస,సత్యాగ్రహం అనే వాటిని రాజకీయాల్లో పట్టువదలకుండా ప్రయోగించి తన గురువు గాంధీజీలాగానే విజయం సాధించిన అపురూపమైన వ్యక్తి పొట్టి శ్రీరాములు అన్నారు.కార్యక్రమంలో ఇంజనీర్ ఘనశ్యామాచార్యులు,గాయకులు మల్లేశ్వరరావు,ఎల్ మురళీకృష్ణ తదితరులు నివాళులర్పించారు.





## గుంటూరు కార్పోరేషన్ కౌన్సిల్ సమావేశంలో వాడి వేడి చర్చ

- -గత కమిషనర్ అవినీతిపై నగరం అంతా కోడై కూస్తుందని విమర్శలు
- -టెండర్లు లేకుండా పనులు చేస్తే బిల్లులు ఎలా చెల్లించాలి అంటూ ప్రశ్నల వర్షం
- -అధికారుల ఆధీనంలో కొచ్చే నగరపాలనలో పెండింగ్ అభివృద్ధి పనులు.. సంపూర్ణ పారిశుద్ధ్యం.. తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలంటూ సూచనలు
- - వీధి కుక్కల నియంత్రణకు కఠిన చర్యలు అవలంబించాలి
- - హోల్సేల్ కూరగాయల మార్కెట్లో రిటైల్ వ్యాపారం చేస్తే... పీవీకే నాయుడు మార్కెట్లో వ్యాపారుల పరిస్థితి ఏమిటి..?
- -ఎక్కువ లెస్ కు టెండర్లు దక్కించుకొని నకిలీ బిల్లులు కాల్ చేసిన కాంట్రాక్టర్లు, చెల్లించిన అధికారులపై చర్యలు తీసుకోవాలి
- - ఓటమి హయాంలో గుంటూరులో కనివిని ఎరుగని అభివృద్ధి పనులు

**గుంటూరు కార్పొరేషన్, మార్చి 16, (ప్రభాతవార్త) :** గుంటూరు నగరపాలక సంస్థ సాధారణ కౌన్సిల్ సమావేశం పాలకవర్గానికి ఇదే ఆఖరి సమావేశం కావడంతో అనుకున్న విధంగానే ప్రాధాన్యత సంతరించుకుంది. కౌన్సిల్ సమావేశంలో వాడి వేడి చిచ్చ జరిగింది. నగరం మేయర్ కోవెలమూడి రవీంద్ర అధ్యక్షుల నగర కమిషనర్ కే మయూర్ అశోక్ ఆధ్వర్యంలో కార్పొరేషన్ లో సోమవారం కౌన్సిల్ సభ్యులు కొలువుదీరారు. ఉదయం 10:30 గంటలకు ప్రారంభమైన కౌన్సిల్ సమావేశం పాలకపక్షం, ప్రతిపక్ష పార్టీ సభ్యుల మధ్య కొంత వాగ్వివాదం జరిగింది. ఇదే ఆఖరి సమావేశం కావడంతో అందరూ సానుకూలంగానే తమ గడువు ముగిసిపోయింది కదా నగర పగ్గాలు అధికారుల చేతుల్లోకి వెళ్తున్న సమయంలో గతంలో పెండింగ్ ఉన్న వర్కులు, నగరాన్ని అభివృద్ధి చేసి మంచి పేరు తేవాలని సభ్యులంతా ఏకకంఠంతో కోరారు. ఇదిలా ఉంటే అనేకమంది తమ డివిజన్లో పనులు పెండింగ్ ఉన్నాయని కౌన్సిల్ దృష్టికి తీసుకుని వచ్చారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్ లో భాగంగా బోర్లు అందుబాటులోకి తేవాలని, పారిశుధ్య పనులు పక్కాగా నిర్వహించే మార్చాలని గుంటూరు గా మారాలి మార్చాలని, అవినీతి అక్రమాలకు తావివ్వకుండా పారదర్శక పాలనతో ప్రజలకు మంచి పనులు చేయాలని కోరారు. అదేవిధంగా గత ఏడాదిన్నర కాలంలో నగర









కమిషనర్ గా పనిచేసిన పులి శ్రీనివాసులు హయాంలో అంతులేని అవినీతి అక్రమాలు జరిగాయని కౌన్సిల్ వేదికగా సభ్యులు ప్రశ్నించారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించే విషయం నుంచి, మొక్కలు కొనుగోలు చేసే విషయం వరకు, అసలు టెండర్లు పిలవకుండానే డబ్బులు చెల్లించారని ఆరోపిస్తూ దీనిపై పూర్తి స్థాయిలో ఎంక్వయిరీ చేయాలని కోరారు. వీధి కుక్కల సమస్య ఎక్కువగా ఉందని, పిల్లల ప్రాణాలు పోతున్న పట్టించుకోకపోతే ఎలా అంటూ దీనిపై సరైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. అనధికారిక ఎల్ఈడి హోర్డింగులు అనేకమంది ప్రమాదాలకు కారణం అవుతున్నాయని, వీటిపై గత కౌన్సిల్లో ప్రశ్నించిన చర్యలు లేవని అసహనం వ్యక్తం చేశార. ఇకపోతే కొల్లి శారద కూరగాయల హోల్సేల్ మార్కెట్ వద్ద రిటైల్ అమ్మకాలు ఎలా పెడతారని, పి వి కె నాయుడు మార్కెట్లో రిటైల్ రిటైల్ వ్యాపారులంతా అనేక ఇబ్బందులకు గురవుతున్నారని కౌన్సిల్ దృష్టికి తీసుకొని వచ్చారు. వీటితో పాటు అనేక నగరంలో ఎదురవుతున్న సమస్యలపై ప్రశ్నలు వర్షం కురిపించారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర సమాధానం ఇచ్చారు. అదేవిధంగా గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గల్లా మాధవి, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసు రత్నం తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ప్రతి సభ్యులు అడిగిన ప్రశ్నలకు కార్పొరేషన్ కు చెందిన ఆయా విభాగాల అధిపతులు సమాధానం చెప్పాక నగర కమిషనర్ కే మయూర్ అశోక్ సభ్యులు అడిగిన ప్రతి ప్రశ్నకు ఆఖరిలో పూర్తిస్థాయిలో సమాధానం ఇచ్చారు. నగరాభివృద్ధి లక్ష్యంగా పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. తమ గడువు ముగిసిపోయిందని కార్పొరేటర్లంతా చెప్పడంతో ఎప్పుడైనా కార్పొరేషన్ కి వచ్చి సమస్యను పరిష్కరించుకునే అవకాశం ఒక నగర పౌరుడిగా ప్రతి ఒక్కరికి ఉందని, తాను తప్పకుండా సమస్య పరిష్కరిస్తానని, అవసరమైతే ఫీల్డ్ స్థాయిలో వచ్చి పరిశీలించి న్యాయం జరిగేలా చూస్తామని భరోసా ఇచ్చారు. ఇకపోతే కార్పొరేషన్లో జరిగే అవినీతిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అందులో ఎంతటి వారు ఉన్నా, తన సొంత వారైనా వదిలిపెట్టేది లేదని నగరమైన రవీంద్ర వెల్లడించుగా, ఇటువంటి అవినీతిపై ప్రభుత్వానికి నివేదిక పంపడం జరిగిందని కమిషనర్ వెల్లడించారు. అదేవిధంగా కార్పొరేషన్ కు చెందిన కోట్ల రూపాయల విలువైన స్థలాలను కార్పొరేషన్ స్వాధీనం చేసుకుని ఆక్రమణ గురికాకుండా చూడాలని కోరారు.

**అవినీతిని ప్రోత్సహించవద్దు : ఎమ్మెల్యే గల్లా మాధవి**

నగరపాలక సంస్థను అడ్డాగా చేసుకొని అవినీతి ప్రోత్సహించే ఎవరిని ఉపేక్షించవద్దని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి అన్నారు. కాంట్రాక్టర్లు పనులు చేయకుండా నగర ప్రజలను ఇబ్బందులు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టెండర్లను 18 శాతం లెస్ కి వేసి పనులు చేయకుండా నిరక్ష్యం చేస్తున్నారని, కార్పొరేషన్ ఆర్థికంగా మోసం చేస్తున్నారని, నకిలీ రసీదులతో బిల్లులు డ్రా చేసినట్టు తన దృష్టికి వచ్చిందని, బాధ్యులైన అధికారులైన వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. నిజాయితీగా పనులు చేసే వాళ్లకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి 15 ఆర్థిక సంఘం నిధులతో చేపట్టే పనులు చేసేందుకు కూడా కాంట్రాక్టర్లు వెనుకడుతున్నారని, బిల్లులు అక్రమంగా చెల్లించటం, పనులు చేస్తే బిల్లులు రావేమోనని భయంతో పనులు జాప్యం చేస్తున్నట్టు తెలిపారు. అదేవిధంగా సంపూర్ణ పాదశుధ్యమే లక్ష్యంగా నగరాన్ని అభివృద్ధి చేయాలన్నారు. పుష్కట్లు పాడైపోయి మహిళలు చెత్త తీసుకెళ్లి ఎందుకు చాలా ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తీసుకొని వచ్చింది. అదేవిధంగా వీధి కుక్కల సమస్యతో పసిపిల్లలకు ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందని దీనికి పర్మినెంట్ సొల్యూషన్ చేపట్టాలని అధికారుల కోరారు. ప్రతి వీధికి వచ్చి నగరంలో 15 కుక్కల వరకు ఉన్నాయని, వాటికి ఏ బీసీ చేసే లోగా అవి 50 వరకు పెరిగే అవకాశం ఉంటుందని ఎలా సాధ్యమంటూ ప్రశ్నించారు. జీజీహెచ్ లో అధికారిక రికార్డుల ప్రకారం నెలలో కుక్క కాటుకు గురైన కేసులు మూడు వేల వరకు ఉన్నాయని, అందులో తన పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి 900 కేసులు ఉన్నటువంటి తెలిపారని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ సమస్య పరిష్కారానికి ఆలోచించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఎక్కడపడితే అక్కడ ఎల్ఈడి డిస్ప్లే బోర్డులు ఉన్నాయని వాటి వల్ల వాహనదారులు ప్రమాదాలు గురవుతున్నారు అన్నారు. 10

## రైతన్న మీకోసంలో పాల్గొన్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి

**వ్యవసాయం,మార్చి 16, ప్రభాతవార్త ప్రతినిధి :** రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా జిల్లా అధికారులు పెదకాకాని గ్రామంలో రైతుల ఇంటికి వెళ్లి రైతును రాజు చేయటానికి ప్రభుత్వం



తీసుకున్న ఐదు ప్రధాన అంశాల కార్యాచరణ గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ముళ్ళపూడి పద్మావతి మాట్లాడుతూ ప్రధానమైన ఐదు అంశాలు గురించి నీటి భద్రత రాష్ట్రంలో ప్రతి ఎకరానికి సాగునీరు అందేలా మౌలిక వసతుల అభివృద్ధి, నీటిపారుదల ప్రాజెక్టుల పురోగతి కాలువల పునరుద్ధరణ, నీటి వనరుల సమర్థ వినియోగం, డిమాండ్ ఆధారిత పంటలు పండించాలని, అగ్రిటెక్ అనగా రైతులకు చేతిలో సాంకేతిక పరిజ్ఞానం పెంచే దిశగా వ్యవసాయంలో డీప్ టెక్,కృత్రిమ మేధస్సు, డ్రోన్లు, ఉపగ్రహ సాంకేతికతను వినియోగంలోకి తీసుకొని రాష్ట్రంలోని రైతులకు రైతు ఐడి ఇవ్వటం ద్వారా ప్రతి రైతు వివరాలను ఒక సమగ్ర డిజిటల్ వ్యవస్థలోకి తీసుకు వస్తున్నామని తెలిపారు. రైతులు స్వయంగా తమంతట తామే పంట నమోదు చేసుకునే సదుపాయం కూడా ఫార్మర్స్ యాప్ ద్వారా అందుబాటులో ఉందని అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ గురించి వివరిస్తూ రైతు పండించిన ఉత్పత్తికి తగిన విలువ పెరగాలంటే ముడి ఉత్పత్తి అమ్మకంతో కాకుండా విలువ ఆధారిత ఉత్పత్తుల ద్వారా రైతు ఆదాయం పెరగాలి అని తెలిపారు. ప్రభుత్వం నుంచి రైతుకి పూర్తి మద్దతు అనే అంశాలపై వివరిస్తూ రైతుకు అవసరమైన ప్రతి దశలో ప్రభుత్వం అండగా ఉందని విత్తనం నుంచి విక్రయం వరకు ప్రభుత్వం రైతుకి అండగా ఉంటుందని తెలిపారు. దానిలో భాగంగానే పెదకాకాని మండలంలో ఈ సంవత్సరము 680 మట్టి నమూనాలు సేకరించామని, అదేవిధంగా అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం కింద 4624 మంది రైతులకు 9 కోట్ల 25 లక్షల రూపాయలు రైతుల ఖాతాలలో జమ చేయడం జరిగిందని అన్నారు. రాబోయే సీజన్లో ఎల్ నినో వర్షాభావ పరిస్థితుల ప్రభావం నుండి బయట పడేందుకుపకృతి వ్యవసాయ పద్ధతులను పాటించాలని చెప్పారు.

## ఆంధ్రుల ఆత్మ గౌరవానికి ప్రతీక పొట్టి శ్రీరాములు

**గుంటూరు, మార్చి16,ప్రభాతవార్త :** ఆంధ్రుల ఆత్మ గౌరవానికి ప్రత్యేక అమజీవి పొట్టి శ్రీరాములు అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్



అన్నారు. సోమవారం పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఎమ్మెల్యే గల్లా మాధవి కూటమి నాయకులు కార్యకర్తలతో కలిసి గుంటూరులో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం హిందూ కాలేజీ వద్ద అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాలను పణంగా పెట్టిన మహనీయుడు శ్రీ పొట్టి శ్రీరాములు అని కొనియాడారు.. ఆయన త్యాగ నిరతి ప్రతి తెలుగువానికి స్ఫూర్తిదాయకమని చెప్పారు. అమరావతిలో దేశంలోనే ఎత్తైన పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం మనందరికీ గర్వకారణమన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తెలుగుజాతి ఆత్మగౌరవం కోసం స్వర్గీయ ఎన్టీ రామారావు కృషి చేస్తే ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం పొట్టి శ్రీరాములు ప్రాణాలను త్యాగం చేశారని తెలిపారు. రాజధాని అమరావతిలో 58 అడుగుల కాంస్య విగ్రహాన్ని నెలకొల్పడం చారిత్రాత్మకమన్నారు.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఖిస్టాచ్యూ ఆఫ్ శాక్రిఫైజ్‌ఖి అని పేరు పెట్టడం అత్యంత అభినందనీయమని, ఈ పేరు ఆయన చేసిన మహోన్నత త్యాగానికి నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు.

## బందోబస్తు ఏర్పాట్లు పరిశీలన

**గుంటూరు క్రైమ్, మార్చి16,ప్రభాతవార్త:** ఈ నెల 18వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గుంటూరు నగరంలో పర్యటించే అవకాశం ఉన్న నేపథ్యంలో, ఆయన చేతుల మీదుగా"దివ్యాంగులకు ఉచిత బస్సు పథకం"ను గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రారంభించే కార్యక్రమం చేపట్టనున్నారు.ఈ నేపథ్యంలో గుంటూరు జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా,జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్,ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి చేపట్టవలసిన ఏర్పాట్లను సోమవారం ప్రత్యక్షంగా పరిశీలించారు.మహాత్మా గాంధీ ఇన్నర్ రింగ్ రోడ్‌లోని శ్రీ కన్వెన్షన్ సమీపంలో ముఖ్యమంత్రి హెలికాప్టర్ దిగేందుకు ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ నిర్మాణ పనులను అధికారులు సమీక్షించారు. అనంతరం అక్కడి నుండి గుంటూరు ఆర్టీసీ బస్ స్టాండ్ వరకు బస్సు ర్యాలీ నిర్వహించే అవకాశాలను కూడా పరిశీలించారు.అలాగే ముఖ్యమంత్రి ఆర్టీసీ బస్ స్టాండ్ వరకు పర్యటించే అవకాశం ఉన్న నేపథ్యంలో, అక్కడ చేపట్టవలసిన భద్రతా,ఇతర ఏర్పాట్లపై అధికారులు సమగ్రంగా చర్చించారు. కార్యక్రమానికి సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను ఉన్నతాధికారులతో సంప్రదించి సిద్ధం చేయాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్,సంబంధిత శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ సూచనలు అందజేశారు.ఈ పరిశీలన కార్యక్రమంలో ఆర్డిఓ కె. శ్రీనివాసరావు, ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సామ్రాజ్యం, ట్రాఫిక్ డీఎస్పీ బి. శ్రీనివాస్, గుంటూరు ఈస్ట్ డీఎస్పీ అజీజ్, ఎస్బి డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్బి సీఐ అలహరి శ్రీనివాస్, డీటీసీ సీతారామిరెడ్డి, గుంటూరు ఈస్ట్ తహసీల్దార్ సుభాని, పాత గుంటూరు సీఐ వెంకట ప్రసాద్, లాలపేట సీఐ శివప్రసాద్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు...

NATIONAL SEEDS CORPORATION LIMITED
(A Government of India Undertaking)
"An ISO 9001:2015 & ISO 14001:2015 Company"
REGIONAL OFFICE, 17-11,Tukaram Gate, Lalaguda,
Secunderabad-500017.(TG) PH: 040 -27731152, 27730635
Mail ID- rm.secunderabad@indiaseeds.com

NOTICE INVITING E-TENDER

National Seeds Corporation Limited, Regional office, Secunderabad invite tenders through e-tendering for purchase of Dhaincha, Sunhemp and Pillipesara Certified or Truthfully Labelled (TL) seeds from reputed seed producers / suppliers. Tender Document can be downloaded from website https://indiaseeds.enivida.com from 17.03.2026, 16.00 hrs. The Tender fee is Rs.1180 and for further details visits our website www.indiaseeds.com. Tenders without Tender Fee and EMD will be rejected. Last Date for submission of online tender is 01.04.2026 till 14.00 hrs. and the date of opening technical bid is 01.04.2026 at 14.30 hrs. If opening date happens to be holiday, the tender will be opened on next working day. If any changes will be placed only on NSC web-site.

No. 1(23)/Mktg/NSC-HYD/2025-26/
Date: 16.03.2026

Regional Manager
National Seeds Corporation
Secunderabad

శ్రీ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానము
పెదకాకాని,గుంటూరు జిల్లా.

సీల్డ్ టెండరు ప్రకటన

ఆర్.సి.నెం.బి/2/2026 తేది: 17-03-2026

పై దేవస్థానమునకు (1) దేవస్థానం వ్యర్థ పదార్థములు ట్రాక్టర్ ద్వారా తరలింపు (ది.01.04.2026 నుండి ది.31.03,2027 వరకు) (2) దేవస్థానం నందలి బహిరంగ మరుగుదొడ్లు నిర్వహణ నిమిత్తం (ది.01.04.2026 నుండి ది.30.09.2026 వరకు) సీల్డ్ టెండరు ది.24.03.2026 ఉదయం గం.11.00 నుండి దేవస్థాన ప్రాంగణము నందు జరుగును. ది.21.03.2026 ఉదయం.10.00 టెండరు డాక్యుమెంట్స్ అందుబాటులో ఉంచటమైనది.తదుపరి వివరముల కొరకు 9849175593 ద్వారా కార్యాలయ పనివేళల నందు తెలుసుకొనగలరు.

కోసూరి పూర్ణచంద్రరావు,చైర్మన్
మరియు ధర్మకర్తల మండలి సభ్యులు

సం/- జి.వి.డి.యన్.లీలాకుమార్.
ఉపకమీషనరు మరియు కార్యనిర్వాహణాధికారి.

# పిజిఆర్ఎస్ లో 88 అర్జీలు స్వీకరించిన ఎస్పీ కృష్ణారావు

**నరసరావుపేట క్రైమ్,మార్చి 16 ప్రభాతవార్త :** అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని సోమవారం పల్నాడు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా



స్వాతంత్ర్య సమరయోధులు పొట్టి శ్రీ రాములు యొక్క చిత్ర పటానికి పూలమాల వేసి పల్నాడు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు నివాళులు అర్పించారు. జిల్లా ఎస్పీ కృష్ణారావు మాట్లాడుతూ, మహాత్మా గాంధీ సిద్ధాంతాలను అనుసరించిన గొప్ప నాయకుడు అమరజీవి అని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు తన ప్రాణాలను అర్పించిన మహానుభావుడు. తెలుగు ప్రజల హక్కుల కోసం ఉపవాస దీక్ష చేపట్టి ప్రాణాలను కోల్పోయారు. అమరజీవి చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష 58 రోజులు కొనసాగింది. దీని ఫలితంగా కేంద్ర ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు అంగీకరించింది. దేశ స్వాతంత్రం కోసం గాంధీజీ పిలుపు మేరకు ఉద్యమంలో భాగస్వామ్యమైయారు. పొట్టి శ్రీరాములు గారి జీవితం మనకు ధైర్యం, త్యాగం, పట్టుదల ఎలా ఉండాలో నేర్పుతుంది. తెలుగు ప్రజల భవిష్యత్తు కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడికి మనం గౌరవంగా శ్రద్ధాంజలి ఘటించాలని, నేటి తరం యువతీ యువకులకు ఆదర్శప్రాయుడని కొనియాడారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి తద్వారా వచ్చిన అర్జీలను వేగంగా, చట్టబద్ధంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఎస్పీ బి.కృష్ణారావు తెలిపారు. ఈ వేదిక ద్వారా ఆర్థిక, కుటుంబ, మోసాలకు సంబంధించిన సమస్యలు వచ్చినట్లు తెలిపారు. అలాగే బెదిరింపులు, ఆక్రమణలు తదితర అంశాలకు సంబంధించిన 88 ఫిర్యాదులను ప్రజలు పోలీస్ అధికారులకు అందజేయగా, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, పోలీస్ అధికారులకు అందజేయడం జరిగింది. మహిళలు, వృద్ధులకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారం పట్ల ప్రత్యేక దృష్టి సారించి, క్షేత్రస్థాయిలో విచారణ వేగవంతం చేసి, చట్ట ప్రకారం వారికి న్యాయం చేయాలని అధికారులకు ఎస్పీ సూచించారు. వివిధ సమస్యలపై అర్జీలు ఇవ్వడానికి వచ్చిన ప్రజలకు, వాటిని రాసి పెట్టడంలో సిబ్బంది సహాయ సహకారాలు అందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) జెవి.సంతోష్, అధికారులు పాల్గొన్నారు.

# ఎన్ఇసిలో 3వ అంతర్జాతీయ సదస్సు పత్రిక ఆవిష్కరణ

**నరసరావుపేట టౌన్, మార్చి 16 ప్రభాతవార్త :** స్థానిక ఎన్ఈసీ కళాశాలలోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగం ఆధ్వర్యంలో 3 వ అంతర్జాతీయ సదస్సు అడ్వాన్సెస్ ఇన్ సిగ్నల్ ప్రాసెసింగ్ అండ్ కమ్యూనికేషన్ (ఎన్ఈసి ఐ.సి.ఏ.ఎస్.పి.సి 2కే26) పత్రికను ఆవిష్కరించడం జరిగిందని కళాశాల ఛైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్




ఎస్. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇటువంటి అంతర్జాతీయ సదస్సుల ద్వారా అధ్యాపకుల మేధోసంపత్తి పెంపుదించడానికి ఎంతగానో దోహదపడతాయని అన్నారు. ఏప్రిల్ 10, 11 తేదీలలో జరిగే ఈ అంతర్జాతీయ సదస్సు జరుగుతుందన్నారు., వివిధ కళాశాల నుంచి అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు పాల్గొని, తమ పరిశోధనా పత్రాలను సమర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ఛైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, సెక్రటరీ మిట్టపల్లి రమేష్ బాబు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డి. సునీల్, ఈసిఈ విభాగాధిపతి డాక్టర్ వి. వెంకటరావు, ఆర్గనైజర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# లక్ష్మీనరసింహస్వామి దేవాలయ నిర్మాణానికి దాతల విరాళం

**నరసరావుపేట టౌన్, మార్చి 16 ప్రభాతవార్త :** పట్నంలోని కోట సెంటర్ పులుపుల వారి వీధిలోవేంచేసి ఉన్న శ్రీ వీరాంజనేయ సహిత యోగానంద సహిత లక్ష్మి నరసింహస్వామి ఆలయ నిర్మాణానికి దాతలు విరాళం అందజేశారు. వివరాలను సోమవారం ఆలయ కమిటీ సభ్యులు వనమా శివ తెలియజేశారు. మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన దాతలు గంగుల వెంకటేశ్వర రెడ్డి వసుంధర దంపతులు 1 లక్ష రూపాయల 2వేల 232 విరాళం అందజేశారని తెలియజేశారు. దాతలకు స్వామివారి దర్శనంతో పాటు తీర్థప్రసాదాలను అర్చకులు అందజేశారు. దేవాలయ నిర్మాణంలో సహకరిస్తున్న



దాతలకు ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వనమా శివ, ఎసిరెడ్డి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించిన డాక్టర్ గోపిరెడ్డి

**నరసరావుపేట, మార్చి 16 ప్రభాతవార్త :** పొట్టి శ్రీరాములు125వ జయంతి కార్యక్రమాన్ని శ్రీ పొట్టి శ్రీరాములు సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా వైకాపా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రము ఏర్పడడానికి ముఖ్య కారకులు శ్రీ పొట్టి శ్రీరాములు అని గుర్తు చేశారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవం, ప్రత్యేక గుర్తింపు కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు



ప్రాణాలను సైతం లెక్కచేయకుండా చేసిన అపూర్వ త్యాగాన్ని ప్రజలందరు స్మరించుకోవాలన్నారు. వారి స్ఫూర్తితో యువత ముందుకు వెళ్లాలన్నారు. వైయస్సార్సీపి వారి ఆశయ సాధనకు కృషి చేస్తుందని పేర్కొన్నారు. తెలుగు ప్రజలు ఎప్పటికీ వారిని మర్చిపోరని డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

# పమిడిమర్రు గ్రామంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పర్యట

**నరసరావుపేట, మార్చి 16 ప్రభాతవార్త :** నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు పమిడిమర్రు , కొండ కావూరు గ్రామలలో పర్యటించారు. రైతులతో వారు ముఖాముఖి నిర్వహించి, "అన్నదాత సుఖీభవ" మరియు "పీఎం కిసాన్" పథకాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం గురించి వివరించారు. అన్నదాత సుఖీభవ (3వ విడత): 540 మంది రైతులకు గాను ..21,60,000/ జమ అయ్యాయి, పీఎం కిసాన్ పథకం కింద రూ.9,44,131/ నిధులు విడుదలయ్యాయి. పమిడిమర్రు గ్రామ పరిధిలో రైతులకు అందిన మొత్తం సహాయం ..31,04,131/., చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ఉమ్మడి కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పారదర్శకమైన పద్ధతిలో నేరుగా రైతుల ఖాతాల్లోకే నగదు జమ చేయడం ద్వారా రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక రైతు సంఘాల ప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాద బాధితులకు శివశక్తి ఫౌండేషన్ సహాయం

**వినుకొండ, మార్చి16, ప్రభాతవార్త:** ఇటీవల అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన చీకటిగలపాలెం గ్రామానికి చెందిన రావూరి అనిత, ముప్పరాజువారి పాలెంకు చెందిన షేక్ చిన్నసాంబి కుటుంబాలను ప్రభుత్వ చీఫ్‌విప్ జీ.వీ ఆంజనేయులు పరామర్శించారు. ప్రభుత్వ చీఫ్‌విప్ వారి కార్యాలయంలో బాధితులకు శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బియ్యం, వంట సామాన్లు, బట్టలు, ఆర్థిక



సహాయాన్ని అందజేశారు. జీ.వీ మాట్లాడుతూ బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని నూతన గృహాలు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే ఫౌండేషన్ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడల్లో ధనలక్ష్మి వ్యాయామ కాలేజి విద్యార్థుల ప్రతిభ

**ఈపూరు, మార్చి16, ప్రభాతవార్త:** ఈ నెల 13,14 తేదీల్లో బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో జరిగిన అంతర్ కళాశాలల ఖోఖో పోటీలలో మండలంలోని ముప్పాళ్ళ ధనలక్ష్మి వ్యాయామ కళాశాల నందు బిపిఈడి ద్వితీయ సంవత్సరం విద్యను అభ్యసిస్తున్న కె.సింహాద్రి నాయక్ పాల్గొని ప్రతిభ కనబర్చి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఖోఖో జట్టుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చుండు వెంకటరావు తెలిపారు. ఈ నెల 22 నుండి 26వ తేదీ వరకు కర్ణాటకలోని ధావన్ గిరి యూనివర్సిటీ నందు జరగబోయే సౌత్ జోన్ విశ్వవిద్యాలయ పోటీలలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాల జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కళాశాల ఛైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు, డైరెక్టర్ దరువురి శ్రావ్య, అధ్యాపకులు ఆర్.బలరాంనాయక్, సిహెచ్ అరవింద్, ఎం.దాసు, ఏ.సాయి ప్రసాద్ తదితరులు సింహాద్రి నాయక్‌ను అభినందించారు.



# పసుమర్రు గ్రామంలో రైతన్న మీకోసం

**చిలకలూరిపేట, మార్చి 16, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం, స్థానిక శాసనసభ్యులుప్రత్తిపాటి పుల్లారావు పర్యవేక్షణలో చిలకలూరిపేట నియోజకవర్గం లో మొదట గా చిలకలూరిపేట మండల పార్టీ అధ్యక్షులు జవ్వాజి మదన్మోహన్ గారి ఆధ్వర్యంలో చిలకలూరిపేట మండలం గురించి ఇంటి ఇంటికి తిరిగి కరపత్రాలను అందజేసి వివరించారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అమలు చేస్తున్న పంచసూత్రాలు గురించి కూడా వివరించారు. నీటి భద్రత కల్పించడం డిమాండ్ ఆధారిత సాగు ప్రోత్సహించడం, సాంకేతిక వ్యవసాయ వినియోగం పెంపొందించడం, ఆహార శుద్ధి



పసుమర్రు గ్రామంలో 'రైతన్న మీకోసం' కార్యక్రమం నిర్వహించారు. . ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, "రైతన్న మీకోసం" అనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నిలబెట్టుకుంటూ ముందుకు సాగుతున్నదని తెలిపారు. అన్నదాత కుటుంబాల్లో ఉగాది పండుగ ఆనందాన్ని తీసుకువచ్చే విధంగా "అన్నదాత సుఖీభవ" కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. అలాగే వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా పి.ఎం. కిసాన్ సమ్మాన్ నిధి మరియు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు అందిస్తున్న పెట్టుబడి సాయం పరిశ్రమల విస్తరణ ద్వారా రైతులకు మెరుగైన ధరలు కల్పించడం, రైతులకు ఆర్థిక సాయం అందించడం, వంటి అంశాలను ప్రభుత్వం ప్రాధాన్యతగా తీసుకొని రైతుల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ ఛైర్మన్ షేక్ కరీముల్లా, నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరు సదాశివరావు , నియోజకవర్గ తెలుగు రైతు సంఘం అధ్యక్షులు అంబటి సోంబాబు ,కొమరవెల్లిపాడు సొసైటీ ప్రెసిడెంట్ కోడె హనుమంతరావు , క్లస్టర్ ఇంచార్జ్ గంజి శ్రీనివాసరావు ,గ్రామ పార్టీ అధ్యక్షులు కొడవలి శ్రీనివాసరావు, తెలుగు మహిళా రమాదేవి , కిరణ్ , వ్యవసాయ శాఖ అధికారులు, గ్రామ నాయకులు మరియు రైతులు పాల్గొన్నారు.

# విద్యారంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట : ఎమ్మెల్యే కన్నా

## -పాఠశాల నూతన తరగతి గదుల ప్రారంభం

**సత్తెనపల్లి, మార్చి 16, ప్రభాతవార్త:** సత్తెనపల్లి పట్టణం 6వ వార్డు నందు ఎంపీ యూపీ హారీస్ పాఠశాల నూతన తరగతి గదులను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ప్రారంభించారు. ఈసందర్భంగా ఓకే కుటుంబంలో ఐదుగురికి తల్లికి వందనం పథకం అమలు అయినందుకు తల్లిదండ్రులు కూటమి ప్రభుత్వానికి, ఎమ్మెల్యే కన్నాకు కృతజ్ఞతలు తెలియజేశారు ఈసందర్భంగా కన్నా మాట్లాడుతూ, మధ్యాహ్నం భోజనం నుంచి స్టూడెంట్స్ కిట్స్ వరకు నాణ్యత పెంచి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని నాణ్యతతో అందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వ మాదిరిగా కాకుండా విద్యార్థులకు ఇచ్చే కిట్ల పై పార్టీ రంగులు చిహ్నాలు ఫోటోలు లేకుండా అందిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం విద్య



వ్యవస్థను అస్తవ్యస్తం చేసిందని, విద్యాశాఖలో అమలు చేస్తున్న వివిధ సంస్కరణలను ఆయన వివరించారు. స్వర్ణాంధ్ర, విజన్ 2047 లక్ష్యంగా విద్యా రంగాన్ని ఆధునికంగా మార్చుతూ, యువతకు ప్రపంచ స్థాయి అవకాశాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమం లో వివిధ హోదాల్లో వున్న ఉపాధ్యాయులు ,రాష్ట్ర జిల్లా నియోజకవర్గ, పట్టణ, వార్డు నాయకులు కార్యకర్తలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ

**వినుకొండ, మార్చి16, ప్రభాతవార్త:** రంజాన్ పండుగ పురస్కరించుకొని స్థానిక ఏబీఎం కాంపౌండ్ నందు లగడపాటి వెంకటరావు నివాసం నందు రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర తెలుగు యువత నాయకులు, సినీ నిర్మాత లగడపాటి శ్రీనివాసరావు దంపతులు పాల్గొని పట్టణంలోని నిరుపేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా అందజేశారు ఈ సందర్భంగా తెలుగు యువత నాయకులు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర



తెలుగు యువత కార్యనిర్వాక కార్యదర్శి షేక్ జానీ, వీరగంధం ప్రశాంత్, టిఎన్‌టియుసి అధ్యక్షుడు అక్బర్ బాషా, టౌన్ ఎస్టీ సెల్ కార్యదర్శి కొమ్ము మరియు బాబు, టౌన్ ఎస్టీ సెల్ అధ్యక్షులు అశోక్ నాయక్, టౌన్ టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు కాజా, కాసిం, గోపి, శంకర్, వలి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతన్నా మీ కోసం వారోత్సవాల్లో భాగంగా ఇంటింటి ప్రచారం

**నూజెండ్ల, మార్చి16, ప్రభాతవార్త:** రైతన్నా మీ కోసం వారోత్సవాల్లో భాగంగా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర



ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయ సంక్షేమ పథకాలతో పాటు ఐదు ముఖ్య సూత్రాలను తెలియజేసి సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ముఖ్యమంత్రి సందేశంతో కూడిన ప్రచార పత్రికలను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అంజనేయులునాయక్, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# తెదేపా ఆధ్వర్యంలో ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు

**వినుకొండ, మార్చి16, ప్రభాతవార్త:** ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలు వినుకొండ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ చీఫ్‌విప్ జీ.వీ ఆంజనేయులు ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ నాయకులు పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీనియర్ నాయకులు మాట్లాడుతూ తెలుగు వారి




ఆత్మగౌరవం కోసం ఆయన చేసిన త్యాగం వెలకట్టలేనిదని ఆయన ఆశయాలు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోటుమర్రి నరసింహారావు, గుడివాడ గురునాథరావు, పువ్వాడ కృష్ణ, రెడ్డి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

# నేతి వెంకన్నను దర్శించుకున్న వైకాపా నేతలు అంబటి, గజ్జల భార్గవరెడ్డి

**రాజుపాలెం, మార్చి 16, ప్రభాతవార్త:** పల్నాడు తిరుమలగా పేరుగాంచిన రాజుపాలెం మండలం దేవరంపాడు గ్రామంలో స్వయంభుగా వెలిసిన శ్రీ నేతి వెంకన్న స్వామి వారిని సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి ,మాజీ మంత్రి, గుంటూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంబటి రాంబాబు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నియోజకవర్గ, పట్టణ, మండల, గ్రామ, వార్డు పార్టీ అనుబంధ విభాగాల బాధ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు కుట్టుమిషన్లు పంపిణీ

**గురజాల, మార్చి 16 ప్రభాతవార్త :** గురజాల పట్టణానికి చెందిన సుందరగిరి సత్తార్ జ్ఞాపకార్థం పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఆయన సతీమణి టీడీపీ మాజీ ఎంపీటీసీ నజీమూన్ సహకారంతో పేద మహిళలు నలుగురికి సోమ వారం కుట్టుమిషన్లు అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మాజీ అధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు, పదో వార్డు కౌన్సిలర్ నేలవల్లి బొల్లయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి, ఎంపీ



ఎంపీటీసీ శరమాళ్ల హనుమంతురావు, యువనేత నవులూరి శ్రీరామ్మూర్తి, షోకత్, జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ప్రారంభమైన 10 పరీక్షలు

**గురజాల, మార్చి 16 ప్రభాతవార్త :** గురజాల పట్టణంలో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలో నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులు అరగంట



ముందుగానే పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. 761 మంది విద్యార్థులకు మొదటి రోజు పరీక్షకు నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. రూట్ ఆఫీసర్‌గా ఎంపీవో ఆకుల సత్యనారాయణ వ్యవహరిస్తున్నారు.

# ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

**గురజాల, మార్చి 16 ప్రభాతవార్త :** అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని సోమవారం పట్టణంలోని ఆర్యవైశ్యులు ఘనంగా



నిర్వహించారు. పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య మండల అధ్యక్షుడు చింతా శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు వారి కోసం ప్రాణాన్ని సైతం లెక్క చేయకుండా 58 రోజులపాటు ఆమరణ నిరాహార దీక్ష చేసిన వ్యక్తి శ్రీరాములు అని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ శ్రీరాములు త్యాగ ఫలితమన్నారు. అమరావతి అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యాన 58 అడుగుల శ్రీరాములు కాంస్య విగ్రహ ఆవిష్కరణకు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ ఛైర్మన్ మూర్తి శ్రీనివాసరావు, చిన్ని శ్రీనివాసరావు, పెరుమాళ్ల ప్రభాకరావు, బొగ్గవరపు అక్కేశ్వరరావు, మారం రామలింగేశ్వరరావు, ఆకుల పిచ్చయ్య గుప్తా, యేచూరి గణేశ్వరరావు, భవిరిశెట్టి ఫణికుమార్, పెద్ద కోటేశ్వరరావు, దాస నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# జీడీసీసీ బ్యాంకు మేనేజర్ పున్నారావు సస్పెండ్

**గురజాల, మార్చి 16 ప్రభాతవార్త :** పట్టణంలోని జీడీసీసీ బ్యాంకు మేనేజర్ పున్నారావు సస్పెండ్‌కు గురయ్యారు. బ్యాంకు నిధుల దుర్వినియోగంపై ఆరోపణల నేపథ్యంలో ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా రుణాలు మంజూరు చేయడం, కొందరు రుణ గ్రహీతలతో కలిసి కుమ్మక్కై బ్యాంకు నిధులను పక్కదారి పట్టించారనే ఆరోపణలున్నాయి. దీనిపై కూటమి ప్రభుత్వ విచారణకు ఆదేశించింది. సుమారు రూ.11.66 కోట్లన్న నిధులు దుర్వినియోగం జరిగినట్లు అధికారులు విచారణలో



తేల్చారు. ఇందులో పున్నారావుతోపాటు మరికొందరు ఉద్యోగుల పాత్ర ఉన్నట్లు నిర్ధారణకు వచ్చారు. త్వరలోనే మరికొందరు ఉద్యోగులపై చర్యలు తీసుకునే అవకాశ ఉంది. గురజాల జీడీసీసీ బ్యాంకులో వైసీపీ ప్రభుత్వ హయాంలో విధులు నిర్వహించి ప్రస్తుతం తాడికొండ, దాచేపల్లిలో విధులు నిర్వహిస్తున్న ఇరువురు ఉద్యోగుల పాత్రపై విచారణ కొనసాగుతోంది.

# పొట్టి శ్రీరాములు గారికి నివాళులర్పించిన సమన్వయకర్త డాక్టర్ గజ్జల

**ముప్పాళ్ల మార్చి 16 ప్రభాతవార్త:** పొట్టి శ్రీరాములు గారి జయంతిని పురస్కరించుకొని సత్తెనపల్లి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు శ్రీరాములు గారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త

**డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి..**



ఈ కార్యక్రమంలో రాష్ట్ర జిల్లా నియోజకవర్గ పట్టణ మండల గ్రామ వార్డు పార్టీ అనుబంధ విభాగాల బాధ్యులు ప్రజాప్రతినిధులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పొట్టి శ్రీరాములకు ఘన నివాళులర్పించిన అర్తిమల్ల

**పెదకూరపాడు, మార్చి 16 ప్రభాతవార్త:** స్వాతంత్ర సమరయోధుడు ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ప్రాణ త్యాగం చేసిన మహామనిషి పొట్టి శ్రీరాములు అని అర్తి మల్ల రమేష్ అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా జిల్లా మాజీ టిడిపి కార్యదర్శి అత్తిమల రమేష్ పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో



మండల పార్టీ నాయకులు టిడిపి కూటమి నాయకులు ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు

# అచ్చంపేట మండలంలో ప్రశాంతంగా పదో తరగతి తెలుగు పరీక్ష

**అచ్చంపేట, మార్చి 16 (ప్రభాత వార్త):** అచ్చంపేట మండలంలోని మూడు పరీక్షా కేంద్రాలలో ఈరోజు నిర్వహించిన పదో తరగతి పబ్లిక్ పరీక్ష (తెలుగు) ప్రశాంతంగా జరిగింది. మొత్తం 440 మంది విద్యార్థులకు గాను 433 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అచ్చంపేట పరీక్షా కేంద్రంలో 179 మంది విద్యార్థులకు గాను 172 మంది హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల పరీక్షా కేంద్రంలో 137 మంది విద్యార్థులు నమోదు కాగా అందరూ పరీక్షకు హాజరయ్యారు. బ్లూ బెల్స్ పాఠశాల పరీక్షా కేంద్రంలో 124 మంది విద్యార్థులకు గాను 124 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్షలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా నిర్వహించబడినట్లు మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) తెలిపారు.

# పదవ తరగతి పరీక్షకు 482 మంది విద్యార్థులు హాజరు

**పెదకూరపాడు, మార్చి 16 (ప్రభాత వార్త):** మండలంలోని మూడు పరీక్ష కేంద్రాలలో మొత్తం 490 మంది విద్యార్థులకు 482 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎంఈఓ ఏకుల ప్రసాదరావు తెలిపారు . జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 75 తాళ్లూరు పరీక్ష కేంద్రమునకు 177 మంది విద్యార్థులకు 170 మంది విద్యార్థులు హాజరైనారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెదకూరపాడు పరీక్ష కేంద్రమునకు 146 మంది విద్యార్థులకు గాను 145 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు . సెంట్ ఆన్స్ పాఠశాల పరీక్ష కేంద్రమునకు



167 మందికి గాను 167 మంది విద్యార్థులు హాజరయ్యారు . ఫ్లయింగ్ స్క్వాడ్ గా వచ్చిన అమరావతి మండల విద్యాశాఖ అధికారి ప్రసాద్ మూడు పరీక్ష కేంద్రాలను విజిట్ చేశారు. సోమవారం జరిగిన మొదటి పరీక్షలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరిగాయని ఎంఈఓ తెలిపారు.

# పొట్టిశ్రీరాములుకు ఘన నివాళి

**రాజుపాలెం, మార్చి 16, ప్రభాతవార్త:** పల్నాడు జిల్లా పిడుగురాళ్ల రాజుపాలెం కెఎన్ఆర్ విద్యాసంస్థల్లో అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కోనేటి నరసింహారావు, బాడిస మస్తాన్ రావు మాట్లాడుతూ తెలుగు ప్రజల హక్కుల కోసం తన ప్రాణాలను అర్పించిన మహనీయుడు అని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సాదినేని నరసింహారావు, తెలకపల్లి గోపికృష్ణ, సిహెచ్ శ్రీనివాసరావు, జె వీరాంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విజ్ఞాన్స్ యూనివర్సిటీకి జాతీయ స్థాయి పేటెంట్

**పొన్నూరు, మార్చి 16,ప్రభాతవార్త:** చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీకి జాతీయస్థాయి పేటెంట్ లభించిందని విశ్వవిద్యాలయం ఇంచార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కేవీ క్రిష్ణకిషోర్




సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విజ్ఞాన్స్ యూనివర్సిటీ సివిల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన పరిశోధన విద్యార్థిని డాక్టర్ ఆళ్ళ సుశీల, ప్రొఫెసర్ అసాది శివశంకర్, అలాగే విజయవాడలోని వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళశాలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.పోలురాజులు సంయుక్తంగా ప్రతిపాదించిన పరిశోధనకు ఈ పేటెంట్ మంజూరైనట్లు వెల్లడించారు.యుటిలైజేషన్ ఆఫ్ స్నేయిల్ షెల్స్ ఫర్ ఎన్హాన్స్‌మెంట్ ఆఫ్ మెకానికల్ ప్రాపర్టీస్ ఆఫ్ సిమెంట్ త్రూ రిడక్షన్ ఆఫ్ ఇంపాక్ట్స్ ఆన్ ఎన్విరాన్‌మెంట్ అనే అంశంపై చేసిన పరిశోధనకు ప్రముఖ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ ఇండియా అథారిటీ పేటెంట్‌ను మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. సిమెంట్ తయారీ ప్రక్రియలో పర్యావరణంపై పడే ప్రతికూల ప్రభావాలను తగ్గించడమే కాకుండా, సహజంగా లభించే వ్యర్థ పదార్థాలను వినియోగించి నిర్మాణ రంగంలో కొత్త అవకాశాలను సృష్టించే లక్ష్యంతో ఈ పరిశోధన సాగిందని వివరించారు.ఈ పేటెంట్‌కు 20సంవత్సరాలపాటు హక్కులు ఉంటాయని తెలిపారు. ప్రస్తుతం పరిశోధన విద్యార్థిని డాక్టర్ ఆళ్ళ సుశీల విజ్ఞాన్స్ లారా ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు.జాతీయ స్థాయి పేటెంట్ సాధించిన డాక్టర్ ఆళ్ళ సుశీల, ప్రొఫెసర్ అసాది శివశంకర్‌లను విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర లావు రత్తయ్య, వీసి కేవీ క్రిష్ణకిషోర్, రిజిస్ట్రార్ పీఎంవీ రావు తదితరులు అభినందించారు.

# క్రమశిక్షణ-మానవత్వం-దానగుణ సమ్మేళనమే రంజాన్

**-వైకాపా సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ**



**పొన్నూరు, మార్చి 16,ప్రభాతవార్త:** క్రమశిక్షణ, మానవత్వం, దానగుణం, సోదర భావంల సమ్మేళనమే రంజాన్ అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. పట్టణంలోని మీనా గ్రాండ్ అపార్టుమెంట్ వద్ద మైనార్టీ నాయకుడు షేక్ నాజర్ ఆధ్వర్యంలో జరిగిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ రంజాన్ మాసం ఉపవాస దీక్ష చేపట్టిన ప్రతి మానవుడికి క్రమశిక్షణ, మానవత్వం, దానగుణం, ఇతరుల పట్ల సోదరభావం కలిగేలా తెలియజేస్తుందన్నారు. ముస్లీం సోదరులు నెల రోజులపాటు కఠోరమైన ఉపవాస దీక్ష చేసి పరిపూర్ణమైన ఆరోగ్యాన్ని పొందుతారన్నారు. ముస్లీం సోదరులందరూ రంజాన్ పర్వదినాన్ని ఉత్సాహంగా అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొని అల్లా కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మాజీ ఛైర్‌పర్సన్ డాక్టర్ నల్లమోతు రూత్‌రాణి, మునిసిపల్ మాజీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ బోయిన శివనాగరాజు, వ్యవసాయ మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, ఆకుల రామమోహన్, వట్టిప్రోలు రంగారావు, యందేటి వెంకటసుబ్బయ్య, షేక్ మౌలాలి, దక్కుమళ్ళ రవి, పీర్ సాహెబ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పంట నమోదు తప్పనిసరి

**-మండల వ్యవసాయాధికారి రాజవరపు వెంకటేశ్వరరావు**

**పొన్నూరు, మార్చి 16,ప్రభాతవార్త:** రైతులు తప్పనిసరిగా తాము పండించే పంటల వివరాలను నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి రాజవరపు వెంకటేశ్వరరావు కోరారు. మండల పరిధిలోని



వడ్డిముక్కల గ్రామంలో రైతన్న మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రాధాన ఐదు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు.రాబోయే తొలకరి సాగుకు ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాభావము కలుగుతుందని దాని గురించి ముందుగా కార్యాచరణ గురించి వివరించారు. ప్రస్తుతం జరుగుతున్న పశ్చిమాసియా యుద్ధం గురించి, దాని ద్వారా జరుగుతున్న దుష్పరిణామాల గురించి రైతులకు వివరించారు.దీని వలన ఎరువులు రవాణాలో జాప్యము వల్ల ఖర్చు పెరిగే అవకాశాలున్నాయన్నారు. ఈ పంట నమోదు, ఈకెవైసీ అనేది తప్పనిసరిగా రైతన్నలు చేయించుకోవాలన్నారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఐ.శ్రీకాంత్, గ్రామ వ్యవసాయ సహాయకులు టి.ప్రసాద్, మార్కెట్‌యార్డు సూపర్‌వైజర్ అవినాష్, అమరేంద్ర, ఎంపిఈఓ సింహాద్రి సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శప్రాయం అమరజీవి త్యాగం

**-భాషా ప్రయుక్త రాష్ట్ర ఏర్పాటుకు ఆయన చేసిన పోరాటం మరువలేనిది**

**బాపట్ల, మార్చి 16. ప్రభాతవార్త:** ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసం తన ప్రాణాలనే త్యాగం చేసిన మహనీయుడు, అమరజీవి పొట్టి శ్రీరాములు తెలుగు జాతి గర్వించదగ్గ నేత అని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ కొనియాడారు. సోమవారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకొని బాపట్ల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆయన



చిత్రపటానికి ఎస్పీ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.పొట్టి శ్రీరాములు జీవితం నేటి యువతకు ఒక గొప్ప పాఠమని అన్నారు. గాంధీజీ అడుగుజాడల్లో నడుస్తూ, అహింసా మార్గంలో అలుపెరగని పోరాటం చేశారని గుర్తుచేశారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం 1952లో ఆయన చేపట్టిన 58 రోజుల ఆమరణ నిరాహార దీక్ష ప్రపంచ చరిత్రలోనే అరుదైనదని, ఆ త్యాగ ఫలితమే నేడు మనం చూస్తున్న భాషా ప్రయుక్త ఆంధ్ర రాష్ట్రమని ఎస్పీ ఉద్ఘాటించారు.

**లక్ష్య సాధనలో పట్టుదల అవసరం**

యువత తమ జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి పొట్టి శ్రీరాములు గారి పట్టుదలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. దేశం కోసం సుఖవంతమైన జీవితాన్ని తృణప్రాయంగా వదిలేసిన ఆయన ధైర్యం అందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు.ఈ కార్యక్రమంలో సిసిఎస్ డిఎస్పీ పి.జగదీష్ నాయక్, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ భుజంగరావు, ఎస్.బి2 ఇన్స్పెక్టర్ రాంబాబు, వెల్ఫేర్ ఆర్ఐ మోలుద్దీన్, పలువురు పోలీస్ అధికారులు మరియు డిపిఓ సిబ్బంది పాల్గొన్నారు.

# బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ సేవలు అమూల్యం

**-సింగంశెట్టి శివశంకర్**

**పొన్నూరు, మార్చి 16,ప్రభాతవార్త:** మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ సేవలు అమూల్యమైనవని శ్రీ కోదండ రామాలయం కార్యదర్శి సింగంశెట్టి శివశంకర్ అన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలగపాలెం రంగా విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన మంచినీటి చలివేంద్రాన్ని శివశంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ ఇంకా



పట్టణంలో కూడా అనేక చోట్ల ఏర్పాటు చేసేందుకు దాతలు ముందుకు వచ్చి పట్టణానికి వచ్చే పాదచారులు, ప్రజల యొక్క దాహార్తిని తీర్చాలని కోరారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో వరుసగా ఆరు సంవత్సరాల నుంచి ఇలాంటి చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులను శంకర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు తిరుమలశెట్టి ఉమాశంకర్, తిరుమలశెట్టి జాహ్నవి, మేఘనాథ్, అసోసియేషన్ కార్యదర్శి గుడివాడ పవన్ తదితరులున్నారు.

# పదవ తరగతి పరీక్షలకు మండలంలో 26 మంది విద్యార్థుల గైహాజరు

**చెరుకుపల్లి ,మార్చి 16, ప్రభాతవార్త :** చెరుకుపల్లి మండలంలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని గూడవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నడింపల్లి వనజ చంద్ర పబ్లిక్ స్కూల్,గుల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,కావూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలును నాలుగు పరీక్ష కేంద్రాలుగా ప్రభుత్వ కేటాయించింది. ఆయా కేంద్రాల్లో మొత్తం 596 మంది విద్యార్థులు పరీక్ష వ్రాయవలసి ఉండగా 580 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు 26 మంది విద్యార్థినీ ,విద్యార్థులు గైహాజరైనట్లుఎంఈఓ పి. లాజర్ తెలిపారు.

# ఘనంగా అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి

**రేపల్లె, మార్చి 16, ప్రభాతవార్త:** అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు సోమవారం రేపల్లె పట్టణంలో ఘనంగా జరిగాయి.ఓల్డుటౌన్‌లోని పొట్టి శ్రీరాములు,మహాత్మాగాంధీ,కొణిజేటి రోశయ్య విగ్రహాలకు ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో తెదేపా రేపల్లె నియోజకవర్గ సీనియర్ నాయకుడు అనగాని శివప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కాళేపల్లి ఈశ్వరబాబు,ఆంధ్రప్రదేశ్ హజ్ కమిటీ



ఛైర్మన్ హాజీ షేక్ హస్సన్ బాషా,ఆలపాటి వేణుగోపాల్‌రావు, మల్లికార్జునరావు,వి.రామకోటేశ్వరరావు,కె.మహేష్,పిగోరీరామకుమారి,కె.సత వ్రతి,టిడిపి నాయకులు పాల్గొన్నారు.పట్టణ ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో వాసవి సేవా మహిళా మండలి ఛారిటబుల్ ట్రస్ట్ అమృతధార కార్యక్రమం ద్వారా అన్నదాన కార్యక్రమం నిర్వహించింది.మండల పరిషత్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారిణి పద్మ,రేపల్లె తహశీల్దార్ ఎం.శ్రీనివాసరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.రేపల్లె రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో డిఏవో పార్వతి,కార్యాలయ సిబ్బంది పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.రేపల్లెలోని వైకాపా ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలు జరిగాయి.ఆంధ్రరాష్ట్రం ఏర్పాటుకు పొట్టి శ్రీరాములు సేవలు కారణమయ్యాయని వైకాపా రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త పీటా నాగమోహన్‌కృష్ణ అన్నారు.కార్య క్రమంలో వైకాపా కార్యకర్తలు,నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

# రైతన్న మీ కోసం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**-మండల వ్యవసాయాధికారి ప్రియదర్శిని**

**చేబ్రోలు(పొన్నూరు), మార్చి 16,ప్రభాతవార్త:** రైతన్న మీ కోసం కార్యక్రమాన్ని రైతన్నలు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ప్రియదర్శిని కోరారు. చేబ్రోలు మండలంలోని అన్ని



గ్రామాల్లో జరిగిన రైతన్న మీ కోసం కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతన్నల కోసం అమలు చేస్తున్న ఐదు ప్రధాన సూత్రాలపై రైతులు పట్టు సాధించాలన్నారు. ఇందులో భాగంగా రైతు సోదరులు నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వ మద్దతు ధర కల్పించేవిధంగా ప్రణాళికలు తయారు చేయడం జరిగిందన్నారు. ప్రతి ఒక్క రైతు తమ మొబైల్‌లో ఫార్మర్ యాప్ ప్లే స్టోర్ నుంచి ఇన్‌స్టాల్ చేసుకోవాలన్నారు. ఈ యాప్‌ద్వారా అందించే సేవలను వివరించారు. రైతన్న మీ కోసం కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి మోహన్, గ్రామవ్యవసాయ సహాయకులు, సేంద్రియ వ్యవసాయ ఐసీఆర్పీ, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

# అవోపా ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు125 వ జయంతి వేడుకలు

**గుంటూరు విద్య మార్చి 16 ప్రభాతవార్త:** గుంటూరు స్థానిక సంగడిగుంట లోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంవద్ద అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా అవోపా అధ్యక్షులు కే.వి. బ్రహ్మం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి, ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అవోపా రాష్ట్ర అధ్యక్షులు తటవర్తి రాంబాబు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కొనకళ్ళ సత్యం పాల్గొన్నారు.తటవర్తి రాంబాబు మాట్లాడుతూ, భాషా ప్రయుక్త రాష్ట్రాల కొరకు పొట్టి శ్రీరాములు గారు 58 రోజులపాటు ఆమరణ నిరాహారదీక్ష చేసి మరణించినారని, వారి త్యాగానికి గుర్తుగా భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడినాయని తెలిపారు.

# ప్రశాంతంగా ప్రారంభమైన10 పరీక్షలు

**-1271మంది విద్యార్థినీ విద్యార్థులు పరీక్షకు హాజరు**

**పొన్నూరు, మార్చి 16,ప్రభాతవార్త:** మండల, పట్టణ పరిధిలోని పలు పాఠశాలల్లో సోమవారం ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు ప్రాశాంతంగా ప్రారంభమయ్యాయి. అన్ని కేంద్రాలకు ఉదయం 9గంటల కల్లా విద్యార్థులు చేరుకున్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన అన్నీ మౌలిక వసతులను కల్పించడం జరిగిందన్నారు. ఏడు పరీక్షా కేంద్రాల్లో 1276మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయాల్సి ఉండగా అందులో ఐదుగురు విద్యార్థులకు పరీక్షకు గైర్హాజరయ్యారు. అన్నీ కేంద్రాలను మండల విద్యాశాఖాధికారులు దూపం రాజు, కొల్లి విజభాస్కర్‌లు సందర్శించి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు.

**కనపడని పోలీసులు:**

పదో తరగతి పరీక్షలు జరుగుతున్న పరీక్షా కేంద్రాల్లో విధిగా పోలీసులు బందో బస్తు నిర్వహించాల్సి ఉంది. అయితే సోమవారం ఏ పరీక్షా కేంద్రంలోనూ ఒక్క పోలీసు కూడా కనపడకపోవడం గమనార్హం. పదో



తరగతి పరీక్షలను పగడ్బందీగా నిర్వహిస్తున్నామని చెప్తున్న ప్రభుత్వాధికారులు అందుకు తిలోదకాలిచ్చారని పరీక్షలు వ్రాసేందుకు వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులు గుసగుసలాడుకోవడం పరీక్షా కేంద్రాల వద్ద కనిపించింది. ఈ విషయమై అర్బన్ సిఐ లావూరి వీరానాయక్‌ను ఫోన్‌లో సంప్రదించగా సిబ్బంది అందరూ బందోబస్తుకు వెళ్ళారని సమాధానం చెప్పారు.

# శాంతి-సహనానికి-ఆధ్యాత్మిక చింతనల సమ్మేళనమే రంజాన్

**-ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్**

**పొన్నూరు, మార్చి 16,ప్రభాతవార్త:** రంజాన్ మాసం అనేది శాంతి, సహనం, సేవా భావానికి ప్రతీక అని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్



అన్నారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని 27వ వార్డుకు చెందిన మొహిద్దీన్ జ్యువలరీ అధినేత షేక్ హుస్సేన్ ఆధ్వర్యంలో325మంది నిరుపేద ముస్లీంలకు రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ధూళిపాళ్ళ మాట్లాడుతూ ఉపవాసం, ప్రార్థనల ద్వారా ఆధ్యాత్మిక విలువలను పెంపొందించుకునే ఈ పవిత్ర నెలలో పేద, అవసరమైన వారికి సహాయం చేయడం ఎంతో గొప్ప సేవ అని చెప్పారు. సమాజంలో ఉన్న బలహీన వర్గాలకు అండగా ఇలబడడం ప్రతి ఒక్కరి బాధ్యతని చెప్పారు.రంజాన్ పండుగను పురస్కరించుకొని నిరుపేద ముస్లీం కుటుంబాలకు నిత్యావసర వస్తువులతో కూడిన తోఫాను అందించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా మొహిద్దీన్ అధినేత షేక్ హుస్సేన్‌ను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో షేక్ బాజ్జి, పఠాన్ ఫిరోజ్‌ఖాన్, షేక్ బాజిసాహెబ్, బండ్లమూడి బాబూరావు, మాదల వెంకటేశ్వరరావు, బొర్రు రామారావు, మహమ్మద్ గౌస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అమరజీవి సాధనే మనందరి లక్ష్యం

**పొన్నూరు, మార్చి 16,ప్రభాతవార్త:** అమరజీవి పొట్టి శ్రీరాములు ఆశయ సాధనే మనందరి లక్ష్యం కావాలని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ పిలుపునిచ్చారు. స్థానిక ఐలాండ్ సెంటర్‌లోని పొట్టి శ్రీరాముల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 125వ జయంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో నరేంద్రకుమార్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధనకు తన ప్రాణాలను పణంగా పెట్టిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని చెప్పారు.కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో అమరావతిలో 58అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం మనం ఆయనకు ఇచ్చే నివాళి అని చెప్పారు. తెలుగు జాతికి ప్రత్యేక గుర్తింపు, రాష్ట్రం ఉండాలని 58రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం గచేసిన ధన్యజీవి పొట్టి శ్రీరాముల అని అన్నారు. అటువంటి మహనీయుడి 125వ జయంతి జరుపుకోవడం మనందరి అదృష్టమన్నారు. జయంతి సందర్భంగా కేక్‌ను కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ



చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం పట్టణాధ్యక్షుడు కారుమూరి ప్రకాష్, మాదల వెంకటేశ్వరరావు, బొర్రు రామారావు, బండ్లమూడి బాబూరావు, షేక్ బాజిసాహెబ్, పఠాన్ ఫిరోజ్‌ఖాన్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆర్టీఐ చట్టం ప్రజాస్వామ్యానికి బ్రహ్మాస్త్రం

**-ఏపి రాష్ట్ర సమాచార కమిషనర్ పి.సింహాచలంనాయుడు**

చేబ్రోలు(పొన్నూరు), మార్చి 16,ప్రభాతవార్త: సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ)ప్రజాస్వామ్య వ్యవస్థను బలపరిచే శక్తివంతమైన సాధనమని,




ప్రజాసామ్యానికి ఇది బ్రహ్మాస్త్రం వంటిదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషనర్ పి.సింహాచలం నాయుడు అన్నారు. చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో 20సంవత్సరాల ఆర్టీఐ, గుడ్ గవర్నెన్స్ అనే వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సింహాచలం నాయుడు మాట్లాడుతూ 2005లో అమల్లోకి వచ్చిన ఆర్టీఐ చట్టం కేవలం ఒక చట్టం మాత్రమే కాకుండా భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో పారదర్శకతను తీసుకువచ్చి కీలక సంస్కరణ అని పేర్కొన్నారు.ప్రజలకు ప్రభుత్వ కార్యకలాపాలపై సమాచారం పొందే హక్కును ఈ చట్టం కల్పించిందని చెప్పారు. దీని ద్వారా ప్రజలు ప్రభుత్వ పనితీరును పర్యవేక్షించే అవకాశం అభించిందన్నారు. సమాచార హక్కు భావనకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న చరిత్రను ఆయన వివరించారు. స్వీడన్‌లో 1766 సమాచార స్వేచ్ఛ చట్టం అమల్లోకి రావడంతో ప్రపచంలో పౌరుల రైట్ టు నో అనే భావనకు పునాది పడిందన్నారు. తరువాత అమెరికా, బ్రిటన్, కెనడా వంటి దేశాలు కూడా సమాచార హక్కుకు సంబంధించిన చట్టాలను అమలు చేసి ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేశాయన్నారు.మన దేశంలో ఆర్టీఐ చట్టం ప్రజల దీర్ఘకాల పోరాట ఫలితంగా అమలులోకి వచ్చిందన్నారు. ముఖ్యంగా రాజస్థాన్‌లోని బేవర్ ప్రాంతంలో మజ్దూర్ కిసాన్ సంఘటన్(ఎంకేఎస్ఎస్)వంటి ప్రజా ఉద్యమాలు హమారా పైసా హమారా హిసాబ్ అనే నినాదంతో సమాచార హక్కు కోసం పోరాడినట్లు వివరించారు.యువతో ఆర్టీఐపై అవగాహన పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సోషల్‌మీడియాలో విమర్శలు చేయడం మాత్రమే కాకుండా ప్రజా సమస్యలపై స్పష్టమైన సమాచారాన్ని సేకరించి బాధ్యతాయుతంగా స్పందించాలన్నారు.విద్యార్థులు ఆర్టీఐ చట్టాన్ని సమర్థవంతంగా వినియోగించి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎపి హైకోర్టు అడ్వకేట్ పి.మనోజ్‌కుమార్ విద్యార్థులకు ఆర్టీఐ పిటీషన్ ఎలా దాఖలు చేయాలో వివరించారు. ముఖ్య అతిథులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని విజ్ఞాన్ ఇన్సిట్యూట్ ఆఫ్ లా డైరెక్టర్, ఆయా విభాగాల డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపక సిబ్బంది, లా విద్యార్థులు పాల్గొన్నారు.

# పీజీఆర్ఎస్‌కు మూడు అర్జీలు

**పొన్నూరు, మార్చి 16,ప్రభాతవార్త:** స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ప్రతి సోవామరం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు వివిధ సమస్యలకు సంబంధించి మూడు అర్జీలు అందినట్లు ఎంపిడిఓ గుమ్మా చంద్రశేఖరరావు తెలిపారు. అందులో సర్వేకి సంబంధించి-2, విద్యుత్‌శాఖకు సంబంధించి ఒక అర్జీ అందినట్లు చెప్పారు. వీటిని పరిష్కరించేందుకు ఆయా శాఖలకు పంపినట్లు చెప్పారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి



పీజీఆర్ఎస్ ఎంతగానో దోహదపడు తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఓ నల్లాని ప్రసాద్, డిప్యూటీ ఎంపీడీఓ వేముల శ్రీనివాసరావు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

# అర్హులైన పిల్లలకు హెచ్‌పీవి వ్యాక్సిన్ వేయించండి

**-వైద్యాధికారి డాక్టర్ షేక్ ఎండి హుస్సేన్**

**పొన్నూరు, మార్చి 16,ప్రభాతవార్త:** అర్హులైన ఆడపిల్లలకు తప్పని సరిగా హెచ్‌పీవి వ్యాక్సిన్ వేయించాలని మన్నవ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ షేక్ ఎండి హుస్సేన్ కోరారు. ప్రాథమిక ఆరోగ్య ఏంద్రం పరిధిలో గుర్తించి పిల్లలకు హెచ్‌పీవి వ్యాక్సిన్ వేశారు. 15సంవత్సరాల లోపు వున్న బాలికలకు తప్పని సరిగా ఈ వ్యాక్సిన్ వేయించాలన్నారు. ఈ వ్యాక్సిన్ వేయించడం ద్వారా



భవిష్యత్తులో గర్భాశయ ముఖ ద్వారా కేన్సర్ అనేది రాకుండా నివారించుకోవచ్చున్నారు. ఈ వ్యాక్సిన్ వేయించడం వల్ల పిల్లలకు ఎలాంటి దుష్ప్రభావం ఉండదన్నారు. అతి ఖరీదైన ఈ వ్యాక్సిన్‌ను ప్రభుత్వం పూర్తిగా ఉచితంగా అందిస్తుందన్నారు. ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని చెప్పారు. బ్రాహ్మణకోడూరు, మునిపల్లె, జూపూడి, ఆరెమండ గ్రామాలకు చెందిన పిల్లలకు వ్యాక్సిన్ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ ఎం.గాయత్రీదేవి, హెచ్ఎస్ ఎం.వేణు, ఎఎన్ఎంలు ఎ.రాణి, జి.నాగలక్ష్మి, ఏసుమ్మ, సలోమి, ఆషావర్కర్లు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక చింతన భక్తికి మార్గం

**-గిరిజన యూత్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు యందేటి వెంకటసుబ్బయ్య**

పొన్నూరు, మార్చి 16,ప్రభాతవార్త: ఆధ్యాత్మిక చింతన భక్తికి మార్గమని గిరిజన యూత్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు యందెటి వెంకటసుబ్బయ్య అన్నారు. తెనాలి నందులపేట, నరేంద్రదేవ్ కాలనీలో శ్రీశ్రీశ్రీ మహాలక్ష్మమ్మ పోలేరమ్మ గంగానమ్మ పోతురాజు స్వామివార్ల కొలుపులో మహోత్సవంల ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవరచుకోవాలన్నారు. గ్రామదేవతలను కొలవడం అనేది అనాదిగా వస్తున్న ఆచారమన్నారు. గ్రామాన్ని అన్ని విధాలుగా రక్షించే దేవతే గ్రామ దేవత



అని చెప్పారు. ఈ వేడుకల్లో తాను కూడా పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కాలనీవాసులు ఐకమత్యంతో ఈ కొలుపులు కొలవడం శుభపరిణామమన్నారు. చిన్నారులచే నిర్వహించిన కోలాట ప్రదర్శన, చెక్క భజన ప్రదర్శన తదితర సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకర్షించాయి. ఈ సందర్భంగా యందెటి వెంకటసుబ్బయ్యను కాలనీ వాసులు ఘనంగా భారీ గజమాలతో సత్కరించారు.

# అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది

**చెరుకుపల్లి ,మార్చి 16, ప్రభాతవార్త :** ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం మహనీయుడు పొట్టి శ్రీరాములు త్యాగం ప్రతి తరానికి ఆదర్శనీయమని ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభాని అన్నారు. పొట్టి శ్రీరాములు 125 వ జయంతి సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి సిబ్బందితో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. 58 రోజుల పాటు కటిక నిరాహార దీక్ష చేసి తన



ప్రాణాలను తప్పించడం ద్వారా ఆంధ్ర రాష్ట్ర అవతరించిందని ఆయన త్యాగ ఫలితమే నేడు మన తెలుగు రాష్ట్రాల ఏర్పాటు ఫలితమని అటువంటి మహనీయుని సేవలను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకొని రాష్ట్ర, సమావేశం కోసం ముందుకు నడవాలని ఎంపిడిఓ అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కేజిఎ శ్రీనివాసన్, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 10 పరీక్షలు ప్రారంభం

**భట్టిప్రోలు(రేపల్లె), మార్చి 16, ప్రభాతవార్త:** మండలంలోని భట్టిప్రోలు, ఐలవరం, పల్లెకోన పరీక్షా కేంద్రాలలో సోమవారం 10 పరీక్షలు ప్రారంభమయ్యాయి. 692 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 678 మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారని మండల విద్యాశాఖ అధికారులు పులి లాజర్, ఎన్.దేవరాజు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలైంది. పోలీస్ బందోబస్తుతో పాటు వైద్య సిబ్బంది పరీక్షా కేంద్రాలలో అందుబాటులో ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకున్నారు.



# బాపట్ల జిల్లా వార్త



## ప్రతి గ్రామంలో రైతన్న మీకోసం వారోత్సవాలు

**నగరం, మార్చి 16, ప్రభాతవార్త:** ప్రభుత్వం నిర్వహించే రైతన్న మీకోసం వారోత్సవాలు ఈనెల 16 నుండి 18 వ తేదీ వరకు, 23వ తేదీ నుండి 25వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో నిర్వహించడం జరుగుతుందని నగరం మండలం వ్యవసాయ అధికారి వి.రమేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో మీ దగ్గరకు వచ్చే వ్యవసాయ సిబ్బందికి సహకరించి వివరాలు నమోదు చేయుటకు సహకరించాలని తెలిపారు. ఆండ్రాయిడ్ ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరు ఫార్మర్ యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని, వ్యవసాయానికి సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు పొందగలరని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# పద్ధతి మార్చుకోకపోతే కఠిన చర్యలు!

**విద్యాశాఖ, సచివాలయాల పనితీరుపై కలెక్టర్ ఆగ్రహం....**
**విద్యార్థుల హాజరుపై ఎంఈఓల నిలదీ**
**చిన్నగంజాం తీరుపై సీరియస్**
**కర్లపాలెంలో గైర్హాజరీపై హెచ్చరిక....**

**బాపట్ల, మార్చి 16. ప్రభాతవార్త:** విద్యా వ్యవస్థలో ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో మెలగాలని, అప్పుడే ఆశించిన అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ నుంచి విద్యాశాఖ అధికారులు, ఎంపీడీఓలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో ఆయన మాట్లాడారు. విద్యారంగం, గ్రామ వార్డు సచివాలయాల పనితీరుపై సమీక్ష నిర్వహిస్తూ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే వారిపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.



**హాజరు శాతం తగ్గడంపై సీరియస్..**

జిల్లాలోని 1,415 ప్రభుత్వ పాఠశాలల్లో లక్షా 30 వేల 983 మంది విద్యార్థులు చదువుతుండగా, హాజరు శాతం కేవలం 89 శాతానికే పరిమితం కావడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. "ప్రభుత్వ పాఠశాలల్లో 100 శాతం హాజరు ఉండాల్సిందే అన్నారు. హాజరు శాతం ఎందుకు తగ్గింది?" అని సంబంధిత ఎంఈఓలను నిలదీశారు. విద్యార్థుల బయోమెట్రిక్ నవీకరణలో జాప్యాన్ని ప్రశ్నించారు. ముఖ్యంగా చిన్నగంజాం మండలంలో గత మూడు నెలలుగా పనితీరు ఆశాజనకంగా లేదని, పద్ధతి మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

**సర్వేలు పెండింగ్ ఉంటే సహించం**

సచివాలయాల పరిధిలో చేపట్టిన యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే పెండింగ్‌పై కలెక్టర్ సీరియస్ అయ్యారు. ఇంకా 4,600 కుటుంబాల సర్వే పెండింగ్‌లో ఉండటంపై ఎంపీడీఓలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం నాటికి సర్వేతో పాటు, 3,522 ఈకేవైసీ పెండింగ్‌లను తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు.

**వరుస గైర్హాజరీలపై కన్ను..**

కర్లపాలెం మండలంలో సచివాలయ సిబ్బంది హాజరు తక్కువగా ఉండటంపై కలెక్టర్ ఆరా తీశారు. సిబ్బంది క్రమశిక్షణ తప్పితే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏపీ సేవ ద్వారా వసూలైన నగదును తక్షణమే ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలని, వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) శ్రీనివాస్ సింగ్, సచివాలయాల ఇన్‌ఛార్జ్ విజయలక్ష్మి, జిల్లా కోఆర్డినేటర్ పి.యశ్వంత్, ఎంపీడీఓలు, ఎంఈఓలు తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్**

**బాపట్ల, మార్చి 16. ప్రభాతవార్త:** వివిధ ప్రభుత్వ శాఖలకు నిర్దేశించిన లక్ష్యాలను ఎప్పటికప్పుడు పెండింగ్ లేకుండా సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్‌లోని న్యూ వి.సి హాల్ నుంచి డిపిఓ ప్రభాకర్ రావు, డిఆర్డీఏ పీడీ బి. సింగయ్యతో కలిసి మున్సిపల్ కమిషనర్లు,



ఎంపీడీఓలు, వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది సమన్వయంతో, ప్రణాళికాబద్ధంగా కష్టపడి పనిచేస్తేనే రాష్ట్రస్థాయి ర్యాంకింగ్‌లో జిల్లాను అగ్రస్థానంలో నిలపగలమన్నారు. అక్షరాంధ్ర ప్రజా సానుకూలత:అక్షరాంధ్ర కార్యక్రమానికి సంబంధించి ఇప్పటికే పరీక్షలు పూర్తయ్యాయని, విద్యార్థుల మార్కులను వెంటనే పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ప్రజా సానుకూలత విషయంలో జిల్లా ప్రస్తుతం 5వ స్థానంలో ఉందన్నారు. కొన్ని సచివాలయాల పరిధిలో పనితీరు బాగున్నప్పటికీ, మరికొన్ని చోట్ల వెనుకబడి ఉన్నామని.. దీనిపై ఎంపీడీఓలు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాలని సూచించారు. ఆస్తి పన్ను, ఇంటి పన్ను వసూళ్లలో ఏమాత్రం జాప్యం ఉండకూడదని, వంద శాతం లక్ష్యాన్ని చేరుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఓడీఎఫ్ (బహిరంగ మలవిసర్జన రహిత) లక్ష్యంలో భాగంగా వ్యక్తిగత, సామూహిక మరుగుదొడ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలన్నారు.

జలజీవన్ మిషన్ స్వామిత్వ:గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా జలజీవన్ మిషన్ ద్వారా చేపట్టిన ట్యాప్ కనెక్షన్ల పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. స్వామిత్వ పథకంలో భాగంగా మూడో విడత గ్రామసభలను త్వరితగతిన నిర్వహించాలని డిపిఓను ఆదేశించారు. ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన కింద షెడ్యూల్డ్ కులాలు ఎక్కువగా ఉన్న గ్రామాలను గుర్తించాలని.. ఒక్కో మండలం నుంచి ఒక గ్రామం చొప్పున జిల్లాలోని 20 గ్రామాలతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సాంఘిక సంక్షేమ శాఖ డిడిని ఆదేశించారు. వీటితో పాటు బ్యాంక్ లింకేజీ, ఉన్నతి, శ్రీనిధి లక్ష్యాలను బ్యాంక్ అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరించుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, డి.ఎల్.డి.ఓలు, డి.ఎల్.పి.ఓలు, ఆర్డబ్ల్యూఎస్ డి.ఈ.ఈలు, ఏ.ఈలు, ఎంపీడీఓలు, ఏపీఎంలు, ఏపీఓలు తదితరులు పాల్గొన్నారు.

# ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలి

**బాపట్ల, మార్చి 16. ప్రభాతవార్త:** జిల్లాలో ఉపాధి హామీ పనులు, గృహ నిర్మాణాలను వేగవంతం చేసి, ఉగాది పండుగ నాటికి లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టరు వి. వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ఎంజిఎన్ఆర్ఇజిఎస్. గృహ నిర్మాణ శాఖ పనుల పురోగతిపై మండల స్థాయి అధికారులతోసమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలు మండలాల్లో



పనుల మందగమనంపై ఆయనతీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

**పనితీరు మారకుంటే కఠిన చర్యలు**

స్వర్ణాంధ్ర విజన్ 2047లో భాగంగా నిర్దేశించిన కేపీఐ ల సాధనలో వెనుకబడిన మండల అధికారులను ప్రశ్నించారు. ముఖ్యంగా వేమూరు మండలంలో పని కల్పనలో పురోగతి లేకపోవడం, మార్టూరులో వంద రోజుల పని దినాల కల్పన అట్టడుగున ఉండటంపై ఎంపీడీవోలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరం మండలంలో రోజువారీ లేబర్ హాజరు సున్నాగా ఉండటంపై సంబంధిత ఏపీఓను నిలదీశారు. ఉపాధి హామీ పనులు నాకు కొత్త కాదు, పదేళ్లుగా వీటిని పర్యవేక్షిస్తున్నాను. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు," అని హెచ్చరించారు. జిల్లాలోని 355 పంచాయతీలకు గాను కేవలం 147 చోట్ల మాత్రమే పనులు జరగడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ప్రతిరోజూ ప్రతి పంచాయతీలో పనులు జరిగేలా చూడాలన్నారు.

**గృహ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి**

పీఎంఏవై 1.0, 2.0 పథకాల కింద మంజూరైన ఇళ్ల నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని హౌసింగ్ ఏఈ, డిఈలను ఆదేశించారు. ప్రభుత్వం అందించే అదనపు నిధులను కేవలం నిర్మాణాలకే వాడాలని, లబ్ధిదారులకు అవగాహన కల్పించి పనులు మొదలుపెట్టించాలన్నారు. సహాయం పొంది కూడా నిర్మాణాలు ప్రారంభించని వారికి వెంటనే నోటీసులు జారీ చేయాలని హౌసింగ్ పీడీకి సూచించారు.

**ఎఫ్ఎండి వ్యాక్సినేషన్‌ను విజయవంతం చేయండి**

ఈ నెల 16 నుండి ఏప్రిల్ 14 వరకు జిల్లావ్యాప్తంగా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జరిగే ఎఫ్ఎండి (గాలికుంటు వ్యాధి) వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. టీకాలు వేసే సిబ్బందికి ఇతర పనులు అప్పగించకుండా, పూర్తిస్థాయిలో వ్యాక్సినేషన్‌పైనే దృష్టి పెట్టేలా చూడాలని ఎంపీడీవోలను ఆదేశించారు. ఈ సమీక్షలో డ్వామా పీడీ విజయలక్ష్మి, హౌసింగ్ పీడీ వెంకటేశ్వరరావు, పశుసంవర్ధక శాఖ అధికారి వేణుగోపాల్ రెడ్డి, వివిధ మండలాల ఎంపీడీవోలు, ఏపీవోలు, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

## ఫ్లెక్సీల సమస్య పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తాం : నాగమోహన్‌కృష్ణ

**రేపల్లె, మార్చి 16, ప్రభాతవార్త:** పట్టణంలో మున్సిపల్ అధికారులు ఫ్లెక్సీల సమస్యను పరిష్కరించని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని వైకాపా రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త పీటా నాగమోహన్‌కృష్ణ హెచ్చరించారు. వైకాపా ఫ్లెక్సీలను తొలగించిన మున్సిపల్ అధికారుల తీరుకు నిరసనగా సోమవారం రేపల్లె పురపాలక సంఘ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. రేపల్లె మున్సిపల్ కమిషనర్ సమాధానమివ్వాలంటూ ఆందోళన చేశారు. అనంతరం నెహ్రూ విగ్రహం సెంటరులోని తెలుగుదేశం పార్టీ ఫ్లెక్సీలను వైకాపా కార్యకర్తలు ధ్వంసం చేశారు. ఈ తరుణంలో పోలీసులకు, వైకాపా నేతలకు వాగ్వాదం చోటుచేసుకుంది. అక్కడి నుంచి ర్యాలీగా బయల్దేరిన వైకాపా నాయకులు, కార్యకర్తలు, మహిళలు రేపల్లె ప్రభుత్వ కార్యాలయాల సముదాయానికి ఎదురుగా ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి ఫ్లెక్సీల సమస్య లేఖను సమర్పించారు. ఈ సందర్భంగా వైకాపా రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త పీటా నాగమోహన్‌కృష్ణ మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు తెలుగుదేశం పార్టీ నాయకులకు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. తొలగించిన వైకాపా ఫ్లెక్సీలను తిరిగి ఏర్పాటు చేయాలని లేకుంటే ఎప్పటి నుంచో ఉన్న తెలుగుదేశం పార్టీ ఫ్లెక్సీలను తొలగించాలని డిమాండ్ చేశారు. ఎటువంటి స్పందన లేకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని చెప్పారు. వైకాపా ప్రభుత్వ హయాంలో ప్రతి పక్షాల ఫ్లెక్సీల ఏర్పాటు వ్యవహారంలో ఎటువంటి అడ్డు చెప్పలేదని ఆయన గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో మున్సిపల్ అధికారుల ఏకపక్ష వైఖరి విచారకరమన్నారు. జగన్ ఫొటో చూస్తేనే ఓర్వలేకపోతున్నారని 2029 ఎన్నికలలో వైకాపా అధికారంలోకి రావడం, జగన్ సిఎం కావటం ఖాయమని ఆయన చెప్పారు. ఫ్లెక్సీల తొలగింపు వ్యవహారానికి కారకులైన వారిని తప్పనిసరిగా గుర్తుపెట్టుకుంటామని నాగమోహన్‌కృష్ణ స్పష్టం చేశారు. రేపల్లె నియోజకవర్గంలోని వైకాపా కార్యకర్తలు, నాయకులకు, మహిళలకు తాను అండగా ఉంటానని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో చిత్రాల ఒబేదు, చిమటా బాలాజీ, నాగిశెట్టి పవన్, కరేటి శేషగిరిరావు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## అర్జీల పరిష్కారంలో నిరక్ష్యం వద్దు : ఎస్పీ ఉమామహేశ్వర్

**బాపట్ల. మార్చి 16: ప్రభాతవార్త:** పోలీస్ స్టేషన్లకు వచ్చే బాధితుల సమస్యలను చట్టపరిధిలో, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని బాపట్ల జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి బాధితులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ స్వయంగా బాధితులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

**బాధితులకు భరోసా.. అధికారులకు ఆదేశాలు**

ఈ కార్యక్రమంలో మొత్తం 59 మంది అర్జీదారులు తమ గోడును ఎస్పీకి వివరించారు. వీటిలో ప్రధానంగా: వరకట్న వేధింపులు, కుటుంబ కలహాలు. భూ వివాదాలు, ఆస్తి తగాదాలు. ఆర్థిక లావాదేవీల్లో మోసాలు.

అర్జీలను క్షుణ్ణంగా పరిశీలిం చారు. సమస్యల పరిష్కారంలో జాప్యం చేయకూడదన్నారు. ఒకసారి వచ్చిన అర్జీ మళ్లీ పునరావృతం కాకుండా, బాధితుడు సంతృప్తి చెందేలా విచారణ జరిపి న్యాయం చేయాలని క్షేత్రస్థాయి అధికారులకు దిశానిర్దేశం చేశారు. చట్టపరిధిలో బాధితులకు సత్వర న్యాయం అందించడమే పోలీసుల ప్రథమ కర్తవ్యమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్ నాయక్, పీజీఆర్ఎస్ సెల్ ఎస్.ఐ లక్ష్మీరాజ్యం, ఇతర పోలీస్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.



## రూ.90 లక్షలతో సిసి రోడ్ల నిర్మాణానికి భూమి పూజ

**నిజాంపట్నం, మార్చి 16, ప్రభాతవార్త:** గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఎల్లవేళలా కృషి చేస్తుందని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన నిజాంపట్నంలో రూ.90లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్లకు ఆయన భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తెదెపా ప్రభుత్వం ఉన్న సమయంలో నిజాంపట్నం లో అనేక సిసి రోడ్లను నిర్మించామని గుర్తు చేశారు. నిజాంపట్నం అభివృద్ధిలో తమ వంతు కృషి ఎల్లప్పుడుఉంటుందన్నారు. హార్బర్ రోడ్, ఫిషర్‌మెన్ కాలనీలో అంతర్గత రోడ్ల నిర్మాణం చేశామన్నారు. గ్రామ ప్రజలు ఎప్పుడైనా తనను కలిసి తమ సమస్యలు తెలియజేసి పరిష్కరించుకోవచ్చన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామని ఆయన తెలియజేశారు. తాగునీటి ఎద్దడి ఎక్కడైనా ఉంటే తనకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణారావు, మోపిదేవి హరనాథ్, బోటు ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మోపిదేవి శ్రీనివాసరావు, కన్నా శ్రీనివాసరావు, అగ్నికుల క్షత్రియ కార్పోరేషన్ డైరెక్టర్ రామకృష్ణ, ఉపసర్పంచ్ మార్కండేయులు, కార్యదర్శి మోడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 14 అర్జీలు

**రేపల్లె, మార్చి 16, ప్రభాతవార్త:** రేపల్లె రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 14 అర్జీలు అందాయి. డివిజనల్ పరిపాలన అధికారిణి పార్వతి అర్జీలను స్వీకరించారు. వేమూరు మండలం లోని పెరవలికి చెందిన పుసులూరి మంజుల పెరవలిపాలెంలోని తన భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అర్జీ అందజేశారు. నగరం మండలంలోని బోరమాదిగపల్లి కి చెందిన కారుమంచి చినసముద్రాలు బోరమాదిగపల్లిలోని తన భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. భట్టిప్రోలు మండలంలోని పెదపులి వర్రుకు చెందిన వజ్రం లలితా పరమేశ్వరి తన భూమిని ఆన్‌లైన్ చేయించాలని అర్జీ అందజేశారు. చేంపల్లె మండలంలోని పెనుమూడికి చెందిన కన్నా సుబ్రహ్మణ్యం పెనుమూడిలో తన ఇంటిని నిర్మించిన స్థలాన్ని సర్వే చేయించాలని అర్జీ అందజేశారు. భట్టి ప్రోలు మండలంలోని పెదపులి వర్రుకు చెందిన మోర్ల పోతురాజు ప్రభుత్వ డొంకమార్గంలోని ఆక్రమణ లను తొలగించాలని ఫిర్యాదు చేశారు. రేపల్లె పురపాలక సంఘానికి చెందిన కౌతరపు చిరంజీవిరావు తన స్థలంలో ఇంటి నిర్మాణానికి అనుమతులు ఇప్పించాలని అర్జీ అందజేశారు. రేపల్లె మున్సిపాలిటీ లోని నాగరాజు మంచినీటి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. రేపల్లె మున్సిపాలిటీలోని 9వ వార్డుకు చెందిన సయ్యద్ భాషా తనను ఇబ్బంది పెడుతున్న పోలీసుల నుంచి రక్షణ కల్పించాలని అర్జీ అందజేశారు. రేపల్లెకు చెందిన దామర్ల శ్రీనివాసరావు తన ఇంటి స్థలాన్ని సర్వే చేయాల్సిందిగా అర్జీ సమర్పించారు. రేపల్లె మండలంలోని బేతపూడికి చెందిన చీకటి శివరామ కోటేశ్వరరావు తన ఇంటి వద్ద నుంచి మురుగునీరు పోయేందుకు పైపులైన్లను ఏర్పాటు చేయించాలని అర్జీ అందజేశారు. రేపల్లె మున్సిపాలిటీకి చెందిన సమ్మెట శ్రీనివాసరావు గ్యాస్ డెలివరీబాయ్ తీసుకువెళ్ళిన గ్యాస్ సిలిండర్‌ను తిరిగి ఇప్పించాలని అర్జీ సమర్పించారు. రేపల్లె మున్సిపాలిటీకి చెందిన వ్యాకరణం పుష్పావతి తన నివాసం పక్కనే ఉన్న హోటల్ నుండి నల్ల మసి వస్తున్నందున తగిన చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరిం చాలని అర్జీ అందజేశారు. సమస్యలను పరిశీలించి పరిష్కరిం చేందుకు చర్యలు తీసుకుంటామని డివిజనల్ పరిపాలన అధికారిణి పార్వతి హామీనిచ్చారు.



## ఘనంగా అమరజీవి 125వ జయంతి వేడుకలు

**కర్లపాలెం. మార్చి 16. ప్రభాతవార్త:** అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలను మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఘనంగా



నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొని పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ శ్రీరాములు మహాత్మా గాంధీ ఆశయాలను అనుసరిస్తూ సామాజిక సమానత్వం, దళితుల హక్కులు, సమాజ అభివృద్ధి కోసం విశేషంగా కృషి చేశారని తెలిపారు. భాషా ప్రాతిపదికన ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటులో ఆయన త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. అమరావతిలో 58 అడుగుల పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని 'త్యాగానికి ప్రతీక'గా ఆమరణ నిరాహార దీక్ష ఫలితంగానే ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఏవో సుమంత్, ఏపీఓ శ్యామ్, సూపరిడెంట్ రజినీ, తదితరులు పాల్గొన్నారు

## అమరజీవి పొట్టి శ్రీరాముల సేవలు చిరస్మరణీయం

**బాపట్ల, మార్చి 16, ప్రభాతవార్త:** ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాలను పణంగా పెట్టిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం వెలకట్టలేనిదని బాపట్ల మండల పరిషత్ అభివృద్ధి అధికారి బాబురావు తెలిపారు. పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని సోమవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ ఆంధ్రుల అస్తిత్వం: తెలుగు వారి కోసం ప్రత్యేక రాష్ట్రం కావాలని, ఆంధ్రుల అస్తిత్వం కోసం పోరాడి ప్రాణాలర్పించిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని పేర్కొన్నారు.. ఈ కార్యక్రమంలో కార్యాలయ పరిపాలనాధికారి (ఏఓ) చక్రధర్, డిప్యూటీ ఎంపిడిఓలు రామకృష్ణ, పల్నాటి శ్రీరాములుతో పాటు వివిధ పంచాయతీల అభివృద్ధి అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## మంతెనవారిపాలెంలో డిజిటల్ రక్షణ కవచం!

**సొంత నిధులతో గ్రామస్తుల ఐక్యత.. సీసీ కెమెరాల నిఘా వ్యవస్థ ప్రారంభం**

**బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు, జిల్లా ఎస్పీ ఉమామహేశ్వరు ప్రశంసలు**

**పిట్టలవానిపాలెం, మార్చి 16,ప్రభాతవార్త:** ప్రభుత్వ నిధుల కోసం ఆశలు పెట్టుకోకుండా, తమ ఊరి భద్రతే పరమావధిగా పిట్టలవానిపాలెం మండలం మంతెనవారిపాలెం గ్రామస్తులు సరికొత్త స్ఫూర్తిని చాటారు. తమ సొంత నిధులతో ఊరంతా 'డిజిటల్ రక్షణ కవచాన్ని ఏర్పాటు చేసుకుని రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచారు. గ్రామస్తుల చొరవతో ఏర్పాటు చేసిన ఈ అధునాతన సీసీ కెమెరాల నిఘా వ్యవస్థను బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు, జిల్లా ఎస్పీ తుమ్మగుంట ఉమామహేశ్వర్‌లు సోమ వారం ఘనంగా ప్రారంభిం చారు. పాఠశాల నుంచే కంటిపాపలా నిఘాగ్రామం లోని ప్రతి వీధి, ప్రధాన కూడళ్లు, ఊరి పొలిమేరలను కవర్ చేస్తూ వ్యూహాత్మకంగా ఈ కెమెరాలను అమర్చారు. ఈ నిఘా దృశ్యాలను నిరంతరం పర్యవేక్షించేందుకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ప్రత్యేకంగా ఒక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఆధునిక వ్యవస్థలతో కూడిన ఈ గదిని ఎమ్మెల్యే, ఎస్పీ సందర్శించి కెమెరాల పనితీరును స్వయంగా పరిశీలించారు. గ్రామస్తుల సాంకేతిక పరిజ్ఞానం, భద్రత పట్ల వారికున్న శ్రద్ధను చూసి అధికారులు, ప్రజాప్రతినిధులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.



ప్రతి గ్రామానికి మంతెనవారిపాలెం ఒక దిక్సూచి: ఎమ్మెల్యేఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు మాట్లాడుతూ.. మంతెనవారిపాలెం గ్రామస్తుల ఐక్యత అద్భుతమని కొనియాడారు. ఊరి బాగు కోసం అంతా ఒక్కటిగా నిలబడి, స్వచ్ఛందంగా నిధులు సేకరించి ఈ స్థాయి నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయడం గొప్ప విషయం. అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడంలో, నేరాల నియంత్రణలో ఈ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయి. ముఖ్యంగా పాఠశాల ఆవరణలోనే కంట్రోల్ రూమ్ ఉండటం వల్ల విద్యార్థులకు మరింత రక్షణ లభిస్తుంది. రాష్ట్రంలోని మిగిలిన గ్రామాలు కూడా ఈ గ్రామాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి" అని ఆయన పిలుపునిచ్చారు.

నేర నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం అవసరం: ఎస్పీశాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావడం శుభపరిణామమని జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ పేర్కొన్నారు. గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ నెట్‌వర్క్ పోలీసులకు ఎంతో సహాయకారిగా ఉంటుందని, నేరస్తుల వెన్నులో వణుకు పుట్టిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పోలీసు అధికారులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారానికి డిమాండ్

**రేపల్లె, మార్చి 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అగ్రిగోల్డ్ బాధితులు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రేపల్లె ఏరియా కన్వీనర్ గొట్టుముక్కల బాలాజీ డిమాండ్ చేశారు. సోమవారం రేపల్లె పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి అసోసియేషన్ నేత



చిలకాల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ ఇటీవల విజయవాడ ధర్నా చౌక్‌లో అసోసియేషన్ ఆధ్వర్యంలో రిలే, నిరవధిక దీక్ష నిర్వహించిన సమయంలో రాష్ట్ర ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితులకు హామీలిచ్చిందన్నారు. ఆ హామీలను తక్షణమే నెరవేర్చాలని ఆయన సూచించారు. కష్టకాలంలో తమ అవసరాలకు చేదోడువాదోడుగా ఉంటుందని అగ్రిగోల్డ్ సంస్థలో కూడబెట్టుకున్న సొమ్మును తిరిగి చెల్లించడంలో మోసం చేశారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గడచిన 11 సంవత్సరాలుగా అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను పరిష్కరించడంలో సానుకూల స్పందన లభించడంలేదన్నారు. దశలవారీ పోరాటాలను చేస్తున్నపటికీ పాలక ప్రభుత్వాల హామీలు నెరవేరడంలేదని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాలని, అగ్రిగోల్డ్ ఆస్తులను తక్షణమే స్వాధీనం చేసుకుని వేలం పాటలు నిర్వహించి బాధితులకు చెల్లింపులు జరపాలని బాలాజీ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రామ్మోహన్‌రావు, షేక్ ఖాదర్, కె.లక్ష్మణ్, పి.శ్రీనివాసరావు, సహదేవుడు, వి.సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతన్న మీకోసం ప్రారంభం

**కొల్లిపర, మార్చి 16, ప్రభాతవార్త:** కొల్లిపర మండలంలోని రైతు సేవా కేంద్రాలలో సోమవారం రైతన్న మీకోసం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యమంత్రి సందేశాన్ని రైతులకు వినిపించారు. రైతుల ఆర్థిక పరిపుష్టి పెంచేందుకు నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం నుండి పూర్తి మద్దతు అనే ఐదు అంశాలపై రైతులతో చర్చించారు. రైతుకు అవసరమైన ప్రతి దశలో ప్రభుత్వం అండగా ఉంటుందని విత్తనం నుండి విక్రయం వరకు ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరిస్తుందని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎన్.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.



# కలుషిత నీటి సమస్యను అరికట్టిన మున్సిపల్ యంత్రాంగం

## -పగలు, రేయి కష్టించిన వైనం.. యుద్ధప్రాతిపదికన లీకేజీ మరమ్మతులు

**చిలకలూరిపేట, మార్చి 16, ప్రభాతవార్త:** కలుషిత నీరు.. ఈ పేరు వింటేనే రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో జరిగిన విషాద ఘటనలు కళ్లముందు కదలాడుతుంటాయి. కానీ, చిలకలూరిపేట మున్సిపల్ అధికారుల ముందుచూపు, రేయింబవళ్లు వారు పడిన శ్రమ సంజీవనగర్ వాసులను పెను ప్రమాదం నుండి కాపాడాయి. గంటల వ్యవధిలో సమస్య మూలాలను గుర్తించి, యుద్ధప్రాతిపదికన పరిష్కరించిన తీరు అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది. అలర్ట్ అయిన యంత్రాంగం... సంజీవనగర్ ప్రాంతంలో తాగునీరు కలుషితమైందని ఫిర్యాదు అందిన వెంటనే మున్సిపల్ కమిషనర్ పి. శ్రీహరిబాబు, డీఈఈ షేక్ అబ్దుల్ రహీం తమ సిబ్బందితో రంగంలోకి దిగారు.



ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశాలతో ఏమాత్రం ఆలస్యం చేయకుండా, ప్రజలెవరూ ఆ నీటిని వాడరాదని హెచ్చరికలు జారీ చేశారు. అప్పటికప్పుడు ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాను ఏర్పాటు చేసి ప్రజల ఇబ్బందులను తొలగించారు. సవాల్‌గా మారిన లీకేజీ అన్వేషణ... మురుగుకాల్వల్లో ఉన్న ఇంటి పైపులైన్ల లీకులను సరిచేసినా సమస్య పరిష్కారం కాకపోవడంతో అధికారులు మరింత లోతుగా శోధించారు. ఓవైపు ఎండల తీవ్రత, మరోవైపు సాగర్ నీటిని చెరువులకు నింపే ప్రక్రియ.. ఈ ఒత్తిడిలోనూ డీఈఈ అబ్దుల్ రహీం క్షేత్రస్థాయిలోనే ఉండి పర్యవేక్షించారు. సుమారు 48 గంటల పాటు నిరంతరాయంగా జరిపిన గాలింపులో అసలు విషయం బయటపడింది. ఓ ప్రైవేటు సంస్థ భూగర్భ వైర్లు వేసే క్రమంలో ప్రధాన పైపులైన్‌కు ఏర్పడిన భారీ లీకేజీయే ఈ కాలుష్యానికి కారణమని గుర్తించారు. సాంకేతిక సవాళ్లను అధిగమించి.. నాలుగు దశాబ్దాల క్రితం నాటి పాత పైపులైన్లు కావడంతో వాటిని సరిచేయడం కత్తిమీద సాములా మారింది. అయితే, ఈ ప్రాంతంపై ఉన్న అపారమైన అవగాహనతో డీఈఈ రహీం ఇతర ప్రాంతాల నుండి అవసరమైన సామగ్రిని తెప్పించి, యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. ఆదివారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో లీకును పూర్తిగా అరికట్టి, తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, పగలు, రేయి గంటల పాటు శ్రమించిన అధికారుల తీరుపై పట్టణ ప్రజల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# పొట్టిశ్రీరాములు త్యాగం చిరస్మరణీయం : ఎమ్మెల్యే కన్నా

**సత్తెనపల్లి, మార్చి 16, ప్రభాతవార్త:** సత్తెనపల్లి పట్టణం తాలూకా సెంటర్‌లో ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణార్పణ చేసిన మహనీయుడు శ్రీ పొట్టి శ్రీరాములుకు ఘన నివాళులర్పించారు. పొట్టిశ్రీరాములు 125వ జయంతి సందర్భంగా ఆయన త్యాగాలను స్మరించుకుంటూ అంజలి ఘటించారు. సత్తెనపల్లి నియోజకవర్గ శాసన సభ్యులు కన్నా లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ,తెలుగు ప్రజల ఆత్మగౌరవం, ప్రత్యేక గుర్తింపు కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా చేసిన అపూర్వ త్యాగాన్ని ప్రజలందరు స్మరించుకోవాలన్నారు. భారతదేశ ప్రజాస్వామ్య మరియు భాషాప్రయుక్త రాష్ట్రాల చరిత్రలో ఖఆంధ్ర రాష్ట్ర ఆవిర్భావం అనేది ఎప్పటికీ చెరిగిపోని ఒక చారిత్రక మైలురాయి అని పేర్కొన్నారు. తెలుగువారి ఐక్యత, ఆత్మగౌరవం మరియు మన ఘనమైన సాంస్కృతిక గుర్తింపును కాపాడుకోవాల్సిన ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరికీ గుర్తుంచుకోవాలన్నారు.



అమరజీవి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని.. జాతి ఐక్యత, రాష్ట్ర అభివృద్ధి మరియు నిస్వార్థ ప్రజాసేవ ద్వారా ఆ లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత నేటి తరంపైనే ఉందన్నారు. ఈ కార్యక్రమం లో వివిధ హోదాల్లో ఉన్న రాష్ట్రజిల్లా, నియోజకవర్గ, పట్టణ, వార్డు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పొట్టిశ్రీరాములుకు నివాళులర్పించిన వైకాపా నేత గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి

**సత్తెనపల్లి, మార్చి 16, ప్రభాతవార్త:** అమరజీవి పొట్టి శ్రీరాములు నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవరెడ్డి ఘన నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకొని సత్తెనపల్లి వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైకాపా నేతలు,కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# సజ్జల'ను కలిసిన బాసు లింగారెడ్డి

**సత్తెనపల్లి, మార్చి 16, ప్రభాతవార్త:** తాడేపల్లి పార్టీ కార్యాలయంలో సోమవారం సత్తెనపల్లి నియోజకవర్గ పరిశీలకుల కమిటీ సమావేశంలో వైఎస్‌ఆర్‌సిపి స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణ రెడ్డిని కలిసి నియోజకవర్గ పరిశీలకుడుగా నియమించినందుకు వినుకొండ నియోజకవర్గ పరిశీలకుడు బాసు లింగారెడ్డి. కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు డిఆర్ గంగదాసు శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# త్యాగానికి ప్రతీక అమరజీవి పొట్టి శ్రీరాములు

సత్తెనపల్లి, మార్చి 16, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణంలోని గాంధీచౌక్ లో ఉన్న గాంధీ బొమ్మల వద్ద ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రమానికి సోమవారం పలువురు నేతలు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బాష ప్రయుక్త రాష్ట్రాలు ఉండాలని, తెలుగు మాట్లాడే వారి కోసం ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి తన ప్రాణాలు సైతం పణంగా పెట్టి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటు కు కారకులు అయిన మహోన్నత వ్యక్తి అని ఆయన సేవలు కొనియాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎన్నికల హామీలో భాగంగా రాజధాని లో విలువైన స్థలం కేటాయించటమే కాక 58 అడుగుల భారీ కాంస్య విగ్రహం ఏర్పాటు చేసి పొట్టి శ్రీరాములు గారి 125 వ జయంతి మహోత్సవం ముగింపు సభ మరియు విగ్రహం ఆవిష్కరణ చేయటం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చౌట శ్రీనివాసరావు, పట్టణ ఆర్యవైశ్య సంఘము అధ్యక్షులు అన్నం బాల సుబ్రహ్మణ్యం, సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులు జవ్వాజి రామోహనరావు, సత్తెనపల్లి అగ్రికల్చర్ మార్కెటింగ్ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ పోతుగంటి రామకోటేశ్వర రావు మరియు వివిధ హోదాల్లో నాయకులు పాల్గొన్నారు. అనంతరం రాజధానిలో పొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణ కార్యక్రమానికి తరలి వెళ్లారు.



# ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆధ్వర్యంలో మద్యం దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

**ఈపూరు, మార్చి16, ప్రభాతవార్త:** గుంటూరు జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమీషనర్ ఎం.రవికుమార్‌రెడ్డి ఈపూరు ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. స్టేషన్ పరిధిలోని పలు అనుమానిత ప్రాంతాలను,మద్యం దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ఈపూరు జనాతా వైన్స్,కొండ్రముట్లలోని వీరాంజనేయ వైన్స్ వద్ద డెకాయ్ ఆపరేషన్లు చేశారు. మద్యం అమ్మకాలు ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా స్కాన్ చేసి విక్రయించేలా చూడడం జరుగుతుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటు సారా,కల్తీ మద్యం,నకిలీ మద్యం,గంజాయి,కల్తీ కల్లు విక్రయాలు గురించి ఎలాంటి సమాచారం ఉన్నా ప్రజలు తమకు తెలియజేయాలన్నారు. ఎక్సైజ్ ఐ యాప్ ద్వారా సిబ్బందికి విధులు కేటాయించడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్స్‌పెక్టర్ ఎస్.కోటేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పనిచేయాలి

## - కూటమి నేతలకు కన్నా సూచన

**సత్తెనపల్లి, మార్చి 16, ప్రభాతవార్త:** సత్తెనపల్లి పట్టణం రఘురామ్ నగర్ ప్రజావేదిక నందు తెలుగుయువత, ఐటీడీపి, టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులతో విస్తృతస్థాయి సమావేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈసందర్భంగా కన్నా మాట్లాడుతూ, ఐకమత్యంగా పనిచేసి నియోజకవర్గాన్ని అగ్రస్థానంలో నిలబెడదామని చెప్పారు. స్థానిక సంస్థాగత ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ



పని చేయాలన్నారు. కూటమి ప్రభుత్వ విజయాలను,సూపర్ సిక్స్ పథకాలను ప్రజలలోకి తీసుకువెళ్లాలని,అమరావతి రాజధాని రావటంతో మన భూముల విలువలు పెరిగాయన్నారు. గత ప్రభుత్వంలో రాజధాని ఎక్కడ అంటే పేరు చెప్పే పరిస్థితి కూడా లేదని, దేశంలో ఎక్కడా లేనటువంటి సంక్షేమ పథకాలు కూటమి ప్రభుత్వం అందిస్తోందని చెప్పారు. ప్రజలకు కూటమి ప్రభుత్వంపై విశ్వాసం పెరుగుతోందని, తల్లికి వందనం కింద ఒక కుటుంబంలో పిల్లలు ఎంతమంది ఉన్నా 15 వేల రూపాయలు చొప్పున వేసామన్నారు. ఈ కార్యక్రమం లో వివిధ హోదాల్లో వున్న రాష్ట్ర జిల్లా, నియోజకవర్గ ,పట్టణ, మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాబోయే రోజుల్లో సత్తెనపల్లి అభివృద్ధికి మరింత కృషి చేద్దాం

## -మున్సిపల్ కౌన్సిల్ చివరి సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

**సత్తెనపల్లి, మార్చి 16, ప్రభాతవార్త:** పార్టీలకు అతీతంగా అందరూ సహకరించారని సత్తెనపల్లి శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు..పట్టణ అభివృద్ధికి ఇప్పటిదాకా కౌన్సిల్ కు సహకరించిన అన్ని పార్టీల కౌన్సిలర్లకు పేరుపేరున



దన్యవాదాలు అని అన్నారు. సోమవారం మునిసిపల్ కౌన్సిల్ చివరి సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం కన్నా మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో సత్తెనపల్లిని మరింత అభివృద్ధిలో నిలుపుకుందామన్నారు. . అనంతరం చివరి సమావేశం సందర్భంగా ఎక్స్ అఫీషియో సభ్యుడి హోదాలో కన్నా పాల్గొన్నారు. అజండాను ఆమోదించిన కౌన్సిల్. మున్సిపల్ చైర్మెన్, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్స్ అందరిని, కో ఆప్షన్ సభ్యులను కన్నా ప్రతి ఒక్కరిని ఘనంగా సన్మానించారు.

# అమరజీవి పొట్టిశ్రీరాములు సేవలు చిరస్మరణీయం

## -ఎమ్మెల్యే ఆనందబాబు

**భట్టి ప్రోలు(రేపల్లె), మార్చి 16, ప్రభాతవార్త:** భాషా ప్రయోక్త రాష్ట్రాల కోసం అలుపెరగని పోరాటం చేసిన అమరజీవి పొట్టిశ్రీరాములు చిరస్మరణీయులని మాజీ మంత్రి,వేమూరు నియోజకవర్గ శాసనసభ్యుడు నక్కా ఆనందబాబు అన్నారు.సోమవారం భట్టి ప్రోలు మండల ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలోని పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జరిగిన సభకు రాష్ట్ర ఆర్యవైశ్య యువజన సంఘాల సమాఖ్య మాజీ అధ్యక్షుడు తూనుగుంట్ల సాయిబాబా అధ్యక్షతవహించారు.ముఖ్యఅతిథిగా హాజరైన నక్కా ఆనందబాబు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంగా



తమిళనాడులో కలిసి ఉన్న తెలుగువారి భవిష్యత్ కోసం భాషా ప్రయోక్త రాష్ట్రానికి తన జీవితాన్నే ఫణంగా పెట్టిన మహోన్నతవ్యక్తి పొట్టి శ్రీరాములు అని అన్నారు.58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం అసువులు బాసిన పుణ్యమూర్తిగా ప్రతి ఒక్కరి మదిలో చెరగని ముద్ర వేసుకున్నారని ఆనందబాబు కొనియాడారు.తెలుగు రాష్ట్రానికి గుర్తింపు లభించిందంటే అమరజీవి అందుకు కారణమన్నారు.అంతటి మహనీయుని జయంతి ఆంధ్రుల పర్వదినమని చెప్పారు.అనంతరం రాజధాని అమరావతిలో 58 అడుగుల పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,మంత్రులు పాల్గొన్న కార్యక్రమాన్ని స్క్రీన్‌పై ప్రదర్శించగా ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు,ప్రజలు,అధికారులు తిలకించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి కె.ఎల్.ప్రభాకరరావు ,తహశీల్దార్ ఎం.శ్రీనివాసరావు,ఎంపిడివో ఎస్.వెంకటరమణ, డిప్యూటీ తహశీల్దార్ అనగాని శాంతలక్ష్మి,వాసవి క్లబ్ అధ్యక్షుడు తూనుగుంట్ల నాగభూషణం, ఆర్యవైశ్య యువజన సంఘాల టౌన్ అధ్యక్షుడు నాగరమేష్,తమ్మన రమేష్‌బాబు,మద్దుల నారాయణ,మాజేటి వెంకటేశ్వరరావు, కొత్తమాసు శ్రీనివాస ప్రసాద్ గుప్తా,బొలిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.భట్టి ప్రోలు వాసవి క్లబ్,కుబేర వనిత క్లబ్, భట్టిప్రోలు,అద్దేపల్లి ఆర్యవైశ్య మహిళా సంఘాల ఆధ్వర్యంలో సాయిబాబా గుడి,టిఎంరావు ఉన్నత పాఠశాల,ఎంపిడివో కార్యాలయం వద్ద అమరజీవి పొట్టి శ్రీరాములు 125 జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా, టి.నాగభూషణం, పి.నాగరాజ కుమారి,సిరం పద్మ,ఉప సర్పంచ్ బి.రామప్రసాద్ ,టిఎన్.సుధారాణి,బి.శ్రీవాణి,ఎం.శైలజకుమారి,సిహెచ్.వెంకటేశ్వర రావు,ప్రధానోపాధ్యాయిని వి.కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# జీఎంసీ కౌన్సిల్ సమావేశంలో ప్రజా సమస్యల పై గళమెత్తిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి

## -నీటి కొరత నుంచి వీధి కుక్కల దాడి కేసుల వరకు పలు అంశాలపై అధికారులకు ప్రశ్నలు

**గుంటూరు, మార్చి 16,ప్రభాతవార్త :**

గుంటూరు నగర పాలక సంస్థ సాధారణ కౌన్సిల్ సమావేశం మరియు బడ్జెట్ పై నిర్వహించిన అత్యవసర సమావేశంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి పాల్గొని నగరంలోని పలు ప్రజా సమస్యలను ప్రస్తావించారు. నీటి కొరత, టెండర్లలో పారదర్శకత, డ్రైనేజీ పనులు, వీధి కుక్కల సమస్య, శానిటేషన్, మార్కెట్ల పరిస్థితి వంటి అనేక అంశాలపై అధికారులను ప్రశ్నిస్తూ తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.





**వేసవిలో నీటి సమస్యపై ఆందోళన**

నగరంలోని కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ తాగునీటి సమస్య కొనసాగుతోందని, రానున్న వేసవిలో ఈ సమస్య మరింత తీవ్రం కావచ్చని హెచ్చరించారు. డివిజన్ వారీగా ఉన్న బోరింగ్లను మరమ్మత్తులు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కొన్నిచోట్ల చిన్నపాటి మరమ్మత్తులు చేస్తేనే బోరింగ్లు పనిచేసే పరిస్థితి ఉందని తెలిపారు.

**టెండర్ ప్రక్రియలో అవకతవకలపై ప్రశ్న**

గత కొన్ని సంవత్సరాలుగా ఒకే కాంట్రాక్టర్లు అనేక పనులు కైవసం చేసుకుంటున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పనుల విలువకు 12 నుంచి 29 శాతం వరకు తక్కువ ధరకు టెండర్లు పొందుతున్నప్పటికీ పనులు సక్రమంగా పూర్తి చేయడం లేదని అన్నారు. ఇలాంటి కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని సూచించారు.

**బిల్లుల చెల్లింపుల్లో పారదర్శకత అవసరం**

నిజాయితీగా పని చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు ఆలస్యమవుతుండగా పనులు మధ్యలో వదిలేసిన వారికి మాత్రం చెల్లింపులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. బిల్లుల చెల్లింపుల్లో స్పష్టమైన విధానం ఉండాలని, పారదర్శకంగా అమలు చేయాలని కోరారు.

**డ్రైనేజీ డీసిల్టేషన్ పనులు త్వరగా పూర్తి చేయాలి**

వర్షాకాలానికి ముందే ప్రధాన డ్రైనేజీల డీసిల్టేషన్ పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఇందుకోసం ప్రత్యేక వర్క్ క్యాలెండర్ రూపొందించి సభ్యులకు అందుబాటులో ఉంచాలని సూచించారు.

**అనధికార హోర్డింగ్స్, ఎల్ఈడి బోర్డులపై చర్యలు**

నగరంలో అనధికార హోర్డింగ్స్ పెరుగుతున్నాయని ఎమ్మెల్యే ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్ఈడి డిస్ప్లే బోర్డులు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. వీటి అనుమతులు, బకాయిల వివరాలు లిఖితపూర్వకంగా ఇవ్వాలని కోరారు.

**పివికే నాయుడు మార్కెట్ సమస్యలు**

పివికే నాయుడు మార్కెట్ పరిస్థితి దయనీయంగా ఉందని ఎమ్మెల్యే తెలిపారు. వర్షం పడితే మార్కెట్ మొత్తం నీటితో నిండిపోతుందని చెప్పారు. సుమారు 200 షాపులకు సరిపడా టాయిలెట్స్ లేవని, మార్కెట్ బయట అనధికారంగా వ్యాపారం జరుగుతోందని పేర్కొన్నారు. దీనిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని అధికారులను కోరారు.

**వీధి కుక్కల సమస్యపై ఆందోళన**

నగరంలో వీధి కుక్కల సమస్య తీవ్రంగా మారిందని ఎమ్మెల్యే తెలిపారు. గత నెలలో సుమారు 3వేల కుక్క కాటు కేసులు నమోదయ్యాయని, అందులో 900 కేసులు గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెందినవని చెప్పారు. సమస్య పరిష్కారానికి డాగ్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

**శానిటేషన్ వ్యవస్థపై సూచనలు**

పుష్ కార్టు పాడైపోవడం వల్ల మహిళా శానిటేషన్ కార్మికులు వాటిని తోసుకోలేకపోతున్నారని ఎమ్మెల్యే తెలిపారు. పాత పుష్ కార్టను మార్చి కొత్తవి అందించాలని కోరారు.

**సచివాలయాల్లో కంప్యూటర్ల సమస్య**

పలు సచివాలయాల్లో కంప్యూటర్లు పనిచేయకపోవడం వల్ల సేవలు అందడం లేదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వెంటనే టెండర్ ప్రక్రియ ద్వారా కొత్త కంప్యూటర్లు అందించాలని సూచించారు.

**కేంద్ర స్మైల్ పథకం అమలుపై వివరాలు కోరిన ఎమ్మెల్యే**

భిక్షాటన చేసేవారు, ట్రాన్స్‌జెండర్ల పునరావాసం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్మైల్ స్కీమ్ ఇండియా పథకం ద్వారా వచ్చే నిధులు ఎలా వినియోగిస్తున్నారో వివరాలు ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు. పథకం గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు.

**అభివృద్ధి పనుల పురోగతిపై సంతృప్తి**

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో గత రెండు సంవత్సరాల్లో రూ.140 కోట్లతో 218 అభివృద్ధి పనులు పూర్తి చేశామని ఎమ్మెల్యే తెలిపారు. మరో రూ.100 కోట్ల పనులు టెండర్ దశలో ఉన్నాయని చెప్పారు. సగం వరకు ఆగిపోయిన పనులను ప్రాధాన్యంగా పూర్తి చేయాలని అధికారులను కోరారు. నగరంలోని సమస్యలపై లిఖితపూర్వక సమాధానాలు ఇవ్వాలని, నిర్దిష్ట గడువులో పరిష్కారాలు చూపాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి నగర పాలక సంస్థ అధికారులను కోరారు.

# పెండింగ్ పనులకు అనుమతులు మంజూరు చేయండి : ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు, మర్చి 16,ప్రభాతవార్త:** గుంటూరు తూర్పు నియోజకవర్గం అత్యంత వెనుకబడిన ప్రాంతం, వైసీపీ ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల కాలంలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపట్టాం. ఈ



పనులు పూర్తి చేసేందుకు మున్సిపల్ అధికారులు పూర్తి సహకారం అవసరం" అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. సోమవారం మేయర్ కోవెలమూడి రవీంద్ర అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఇప్పటి వరకు చేపట్టిన అభివృద్ధి పనుల గురించి వివరిస్తూనే పెండింగ్లో ఉన్న కార్యక్రమాలు, చేపట్టవలసిన పనుల గురించి కౌన్సిల్ లో వివరించారు. ప్రధానంగా శానిటేషన్ సమస్య ఎక్కువగా ఉందని, డివిజన్లవారీగా శానిటేషన్ ఇన్స్పెక్టర్లను నియమించి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. కుక్కల బెడద ఎక్కువగా ఉందని, మున్సిపల్ అధికారులు ప్రధానంగా దృష్టి సారించాలని స్పష్టం చేశారు. పాత గుంటూరు, ఏటుకూరు రోడ్డులో శ్మశాన వాటికల అభివృద్ధికి డిపిఆర్ పూర్తయిందని, కానీ ఆమోదం తెలపలేదని చెప్పారు . ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చాక వెల్ఫేర్ స్థలంలో ఆసుపత్రి నిర్మాణంతోపాటు క్రీడా ప్రాంగణం అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టామని, దీనికి కౌన్సిల్ సహకారం అవసరమని చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. నియోజకవర్గంలో మణి హాస్పిటల్ నుంచి బాలాజీ నగర్ వరకు, నాజ్ సెంటర్ నుంచి శనక్కాయల ఫ్యాక్టరీ వరకు రోడ్డు నిర్మాణం చేపట్టామని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో 40 అడుగుల రోడ్లను అరవై అడుగులుగా విస్తరించామని వెల్లడించారు.

# సీఎం సహాయనిధి పేదలకు ఆర్థిక భరోసా

## జనసేన క్రియాశీలక సభ్యుడికి రూ.3.36 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

మంగళగిరి, మార్చి 16, ప్రభాతవార్త: మంగళగిరి మండలం, ఆత్మకూరు గ్రామానికి చెందిన జనసేన పార్టీ క్రియాశీలక సభ్యుడు లింగినేని శివ శ్రీనివాసరావు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి రూ.3 లక్షల 36 వేల విలువ గల చెక్కును అందజేశారు.ఇటీవల గుండెకు రక్తప్రవాహాన్ని అందించే ధమనులు మూసుకుపోవడంతో ఆయనకు బైపాస్ శస్త్రచికిత్స చేయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్, జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇంచార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు కొన్ని రోజుల క్రితం వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు.ఆపరేషన్ ఖర్చుల భారం అధికంగా ఉండటంతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందించాలని బాధిత కుటుంబ సభ్యులు కోరగా, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ క్యాంపు కార్యాలయం ద్వారా సంబంధిత ప్రభుత్వ అధికారులతో మాట్లాడి సీఎంఆర్ఎఫ్ నుంచి ఆర్థిక సహాయం మంజూరు చేయించారు.మంగళగిరి ఆటోనగర్ లోని ఏపీ ఎం ఎస్ ఐ డి సి ప్రధాన కార్యాలయం నందు సోమవారం చిల్లపల్లి శ్రీనివాసరావు రూ.3.36 లక్షల విలువ గల చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారుఈ సందర్భంగా చిల్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ...ఆపదలో ఉన్న ప్రజలకు కులం, మతం, పార్టీలు అనే తేడా లేకుండా సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని తెలిపారు.ఎలాంటి వ్యత్యాసం చూపకుండా అందరికీ న్యాయం చేస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని పేర్కొన్నారు. ఇప్పటికే కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో



ఈ సహాయం వారికి కొంత భరోసా కలిగిస్తుందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ వైద్య వ్యవస్థను బలోపేతం చేస్తూనే, వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పేద కుటుంబాలకు వైద్య ఖర్చులు భారంగా మారకుండా సకాలంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్వోసీలు అందజేస్తూ వారి ఆరోగ్యానికి బాసటగా నిలుస్తోందని తెలిపారు.ఇది పేదల ప్రభుత్వమని, ప్రజల ఆరోగ్యానికి భరోసానిచ్చే మనసున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు.

# జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లు కేటాయించాలి : కేసన శంకరరావు

**మంగళగిరి, మార్చి 16, ప్రభాతవార్త :** దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న ఓబీసీల జనాభా కచ్చితంగా తేల్చేందుకు,ఈసారి కేంద్రం చేపడుతున్న జనగణన ఫార్మేట్లో ప్రతి వ్యక్తి కులంతో పాటు ఓబీసీ కాలమ్ కూడా చేర్చాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు కేంద్రాన్ని కోరారు. స్థానిక తాడేపల్లి జయభేరి నివాసంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ను కలిసి ఆ మేరకు సోమవారం విజ్ఞాపన పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కేసన మీడియా మాట్లాడుతూ దశాబ్దాలుగా జాతీయస్థాయిలో అన్ని ఓబీసీ సంఘాలు జనాభా దామాషా మేరకు ఓబీసీలకు స్థానిక సంస్థలు చట్టసభలలో రిజర్వేషన్ల పెంపుకై పోరాడుతున్నామన్నారు.రిజర్వేషన్ల పెంపుకు ప్రధాన అడ్డంకిగా ఉన్న సుప్రీంకోర్టు ట్రిపుల్ టెస్ట్ ఆర్డర్ లోని తొలి రెండు అంశాల ప్రకారం ముందుగా జనగణన చట్టబద్ధమైన డెడికేటెడ్ కమిషన్ ద్వారా సమగ్ర కుల గణనను శాస్త్రీయంగా ఎంపరికల్ డేటాను సేకరించి, ఆపై జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లు కేటాయించాల్సి ఉందన్నారు. ఈ విషయమై కేంద్ర మంత్రిమండలి ఈసారి జరిపే జనగణనతో పాటే సమగ్ర కుల గణన చేయాలని నిర్ణయించడాన్ని ఓబీసీ సమాజం హర్షిస్తుందన్నారు. కానీ ఇటీవల కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన జనగణన ఫార్మేట్ లో ఓబీసీ కాలం లేకపోవడాన్ని ఓబీసీ సంఘాలు జీర్ణించుకోలేకపోతున్నాయన్నారు. జనగణన ఫార్మేట్ లో ఓబీసీ కాలం లేకపోతే,ఆయా నియోజకవర్గాలలోని ఓబీసీ కులాల విడివిడి జనాభా గాని, మొత్తం ఓబీసీల జనాభా లెక్కలు గానీ తెలియవన్నారు.ఈ నెల 23న ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద జాతీయస్థాయి ఓబీసీ సంఘాలన్నీ కలిసి మహా ధర్నాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహా ధర్నాకు కేంద్ర ఎన్డీఏ కూటమి పార్లమెంటు సభ్యులందరూ సంఘీభావం తెలియజేసేలా చొరవ చూపాలని కేంద్రమంత్రి పెమ్మసానిని తమ విజ్ఞాపన పత్రంలో కోరామన్నారు. జాతీయస్థాయి ఓబీసీ నాయకులతో ఈ అంశమై చర్చించేందుకు ప్రధాని నరేంద్ర మోడీ అపాయింట్మెంట్ను కూడా ఇప్పించాలని విజ్ఞప్తి చేశామన్నారు. ఇంకా ఈ విజ్ఞాపన పత్రమును సమర్పించిన వారిలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుమార్ క్రాంతి కుమార్, ఇండస్ట్రియల్ డిపార్ట్మెంట్ మాజీ డిప్యూటీ డైరెక్టర్ సత్యనారాయణ పలువురు బీసీ నాయకులు ఉన్నారు.



# గుంటూరు కార్పోరేషన్ కౌన్సిల్ సమావేశంలో వాడి వేడి చర్చ

5వపేజీ తరువాయి

అనధికారిక బోర్డులు చాలా ఉన్నాయని, వాటి తొలగింపు ప్రక్రియ ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నించారు. అసలు ఎల్ఈడి బోర్డులకు అనుమతులు ఎన్ని ఇచ్చారని రాతపూర్వకంగా ఇవ్వాలని కోరగా సమాధానం ఇవ్వట్లేదు అన్నారు. ఇకపోతే శానిటేషన్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపెట్టాలని, నగరంలో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టాలని, రిజర్వాయర్ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని, కొల్లిశారద హోల్సేల్ మార్కెట్ హోల్సేల్ గానే వ్యాపారాలు కొనసాగించాలి తప్ప రిటైల్ గా వ్యాపారాలు ఎందుకు చేస్తున్నారు అన్నారు. అదేవిధంగా పీవీకే నాయుడు మార్కెట్లో రిటైల్ వ్యాపారాలు చేస్తుంటే వారు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని, సుమారు 200 మంది ఇబ్బంది పడుతున్నారని వారంతా తనకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఓ పక్క వ్యాపారాలు లేక వాళ్ళు ఇబ్బందికి గురవుతుంటే వారి నుంచి ఆశీలు వసూలు చేస్తున్నారన్నారు. మార్కెట్ చుట్టుపక్కల కార్పొరేషన్ ఎదురు అనధికారికంగా బళ్ళు పెట్టుకొని వ్యాపారాలు చేస్తున్నారని, వారి వద్ద నుంచి ఎవరో వచ్చి డబ్బులు వసూలు చేస్తున్నట్టు తనకు చెప్పారన్నారు. ప్రతి చోట రైతుబజార్లు రావడం వల్ల, హోల్సేల్ వ్యాపారులు సైతం రిటైల్ అమ్మకాలు చేయటం వల్ల పీవీకే నాయుడు మార్కెట్ వ్యాపారులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇకపోతే సివిల్ పనులకు కాంట్రాక్టుకు అనధికారికంగా బిల్లులు చెల్లించిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. పనులు చేయని కాంట్రాక్టర్లను బ్లాక్లిస్టులో పెట్టాలని ఆదేశించారు. గుంటూరు నగరాన్ని స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దాలని సూచించారు.

**కూటమి ప్రభుత్వ హయాంలో గుంటూరు అభివృద్ధి: ఎమ్మెల్యే నసీర్**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో గుంటూరు నగరంలో కనివిని ఎరుగని రీతిలో అభివృద్ధి పనులతో దూసుకుపోతున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ తెలిపారు. ఆర్ఓబీల అభివృద్ధి, పనులు ప్రారంభించడం జరిగిందని, 60 అడుగుల రోడ్డు 80 అడుగుల రోడ్డు విస్తరణలకు ప్రణాళికల రూపొందించడం జరిగిందన్నారు. తూర్పు నియోజకవర్గం లో స్విమ్మింగ్ పూల్, వెల్ఫేర్ సెంటర్లో క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేయటం, తాగునీటి సమస్య పరిష్కారానికి నూతనంగా రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. అదేవిధంగా కబేళా స్థలంలో కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, స్విమ్మింగ్ పూల్ ఏర్పాటుకు సైతం చర్యలు తీసుకోవడం జరిగిందని వెల్లడించారు. అభివృద్ధి పనుల్లో టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం చేయకుండా, నాణ్యత పాటించకపోవ్వట, ఉండకుండా ఉండాలంటే, ఆ పనులు చేసే కాంట్రాక్టర్ నే ఐదు నెలలు పర్యవేక్షణ కోసం ఉంచి ఆ తర్వాతే బిల్లులు చెల్లించాలన్నారు. సచివాలయాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. పనులు చేపించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.

**అనధికారిక లేఅవుట్లపై చర్యలు తీసుకోండి.: ఎమ్మెల్సీ ఏసు రత్నం**

లేఅవుట్ అప్రూవల్ పద్ధతి ప్రకారం చేస్తే బాగుంటుందన్నారు. ఒకటి ట్రాన్స్పరెన్సీ ప్రకారం చేసే అనధికారక లేఔట్లపై చర్యలు తీసుకోవడం సాధ్యమవుతుందన్నారు. మాస్టర్ ప్లాన్ ఆన్లైన్ చేసి పబ్లిక్ డొమైన్ లో ఉంటే అది అనధికారకంగా ఉంటుందని తెలిసిపోతుందన్నారు. ఆన్లైన్ విధానం అమలు చేస్తే బాగుంటుందని అక్రమాలు జరగకుండా ఉంటాయన్నారు. ఇకపోతే బ్రాడీపేటలో హాస్టల్ గురించి అడిగిన ప్రశ్నలకు సమాధానం గా అనధికారిక మీద నిర్వహించే హాస్టల్లో ఎక్కువమంది పిల్లలను ఉంచి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. పోలీస్ డిపార్ట్మెంట్ ద్వారా సీసీ కెమెరాలు పెట్టించే విధంగా చేయాలని, సలహాలు చూసాను ఇచ్చారు.

**తప్పు ఎవరు చేసినా ఉపేక్షించేది లేదు కౌన్సిల్ వేదిక చర్యలు : నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర**

కార్పొరేషన్ అడ్డం పెట్టుకొని తప్పు ఎవరు చేసిన ఉపేక్షించేది లేదని, అది నా బంధువులైన ,స్నేహితులైన ఎవరిని వదిలిపెట్టేది లేదని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర స్పష్టం చేశారు. ఈ అక్రమాలు జరిగే అని చెబుతున్న వాటి పూర్తి వివరాలు సమర్పిస్తానని, నేరుగా నన్ను వచ్చి కలవచ్చు అన్నారు. కనివిని ఎన్నికల అభివృద్ధి చేయాలన్న తపనతో పార్టీలకతీతంగా అనేక పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఏ విధంగా తన హయాంలో గుంటూరు నగర అభివృద్ధి చేయాలని తాపత్రయపడ్డానన్నారు. తప్పు చేసిన కాంట్రాక్టర్లపై చర్యలు తప్పవని, అధికారులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయడం జరిగింది అన్నారు. రెవెన్యూ రికవరీ ఆక్ట్ కింద డబ్బులు తిరిగి వసూలు చేసే చర్యలు తీసుకుంటామన్నారు. ఎందుకు సంబంధించి కౌన్సిల్ వేదిక ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. ఇకపోతే వీధి కుక్కల సమస్యకు సంబంధించి డాగ్ లవర్ తో చర్చించి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే పసిపిల్లల ప్రాణాలు పోతుంటే చాలా బాధగా ఉందని, కుక్కల్ని పట్టుకెళ్ళి పేరేచర్ల కొండల్లో వదిలిపెట్టేయాలని, దానికి సంబంధించి ఆధారాలు చూపెట్టవచ్చని అన్నారు. డబ్బు అనాధికారంగా ఇచ్చిన అధికారులపై నిర్వహిస్తామన్నారు.

**నగర అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తాం : కమిషనర్ అశోక్**

సభ్యులు ఈ కౌన్సిల్లో అన్నీ విషయాలు చెప్పారని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించటం జరిగిందని నగర కమిషనర్ మయూర్ అశోక్ వెల్లడించారు. చర్చించిన అన్ని విషయాలు తమ హెచ్ ఓ డి లు సభ్యులకు సమాధానం చెప్పారని వెల్లడించారు. 700 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని, అయితే అన్ని పనులు ఒకేసారి ఇవ్వటం సాధ్యం కాదని, దశలవారీగా ప్రాధాన్యతను బట్టి పనులు చేసుకుంటూ నగరాభివృద్ధికి ప్రత్యేక బ్యూటిఫికేషన్ సిటిగా తీర్చదిద్దేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇకపోతే ఇంజనీరింగ్ విభాగంలో టెండర్లు మాల్ ప్రాక్టీస్ ప్రకారం అవినీతి అక్రమాలకు పాల్పడి, డబ్బులు కొల్లగొట్టారని ఎస్ ఈ తనకు నివేదిక పంపించడం జరిగింది అన్నారు. వెంటనే ఈ అక్రమాలకు సంబంధించి ఏపీడీఎస్ తో మాట్లాడటం జరిగిందని, విచారణ జరుగుతుందన్నారు. అదేవిధంగా సి డి ఎం ఏ కు నివేదిక సమర్పించాం అన్నారు. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. విజిలెన్స్ ఎంక్వయిరీ సైతం నిర్వహిస్తామని స్పష్టం చేశారు. శానిటేషన్ పై ప్రత్యేక దృష్టి సారి ఇచ్చినట్లు తెలిపారు. ఈ ఆటోలో వినియోగంలో తీసుకోవాలని ఆలోచనలో ఉన్నామన్నారు. ఇప్పటివరకు ప్రజా ప్రతినిధులు, అయితేనే సమస్యలు పరిష్కరిస్తారేమో అనుకుంటున్నారేమో, నగర పౌరులుగా వచ్చి అడిగిన పనిచేస్తానని హామీ ఇచ్చారు. మీరు ఎప్పుడైనా రావచ్చు అని అవసరం అయితే తానే క్షేత్రస్థాయిలో వచ్చి సమస్య పరిష్కరించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అందరం కలిసి గుంటూరు క్లీన్ అండ్ గ్రీన్ గాక తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు స్పష్టం చేశారు.

# చుక్క నీరు లేదు.. ట్యాంకర్ జాడ లేదు..

## -చిలకలూరిపేటలో మంచినీటి కోసం తల్లడిల్లుతున్న ప్రజలు

**చిలకలూరిపేట, మార్చి 16, ప్రభాతవార్త:** చిలకలూరిపేట: పట్టణంలోని రజక కాలనీ, నెహ్రూ నగర్ ప్రాంతాల్లో గత మూడు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పైపులైన్ లీకేజీ పనుల



పేరుతో అధికారులు నీటి సరఫరాను నిలిపివేసినప్పటికీ, కనీసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సప్లై ఉన్న రోజున మాత్రమే కాకుండా, సాధారణ రోజుల్లో కూడా చుక్క నీరు రాకపోవడంతో దాహార్తిని తీర్చుకోవడానికి ప్రజలు అల్లాడిపోతున్నారు.అధికారులు లీకేజీ మరమ్మతులు చేస్తున్నామని చెబుతున్నారే తప్ప, ప్రజల కనీస అవసరాలను గుర్తించడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం మున్సిపల్ వాటర్ ట్యాంకుల ద్వారా కూడా తాగునీటిని అందించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట అని వారు మండిపడుతున్నారు. "ముప్పై ఏళ్లుగా లేని కష్టాలు ఇప్పుడు పడుతున్నాం, మాకు నీటి మోక్షం ఎప్పుడు?" అంటూ నెహ్రూ నగర్ వాసులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, వెంటనే నీటి సరఫరాను పునరుద్ధరించాలని లేదా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని ఆయా కాలనీల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# త్రికోటేశ్వరుని ముఖద్వారం వద్ద పత్తిపాటి వెంకట కుమారి ప్రత్యేక పూజలు

**చిలకలూరిపేట, మార్చి 16, ప్రభాతవార్త:** చిలకలూరిపేట అడ్డరోడ్డు వద్ద త్రికోటేశ్వరుని ముఖ ద్వారం వద్ద ఏర్పాటుచేసిన మహా శివుడి విగ్రహం వద్ద పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు బత్తినేని శ్రీనివాసరావు ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు సతీమణి వెంకట కుమారి వెంకట కుమారి శివుడు విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి కొబ్బరికాయలు కొట్టి విగ్రహం ఏర్పాటు చేసిన దాతలందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పురుషోత్తపట్నంలో దేవుడి



కార్యక్రమాలు చాలా బాగా చేస్తూ ఉంటారు అలానే భక్తి కార్యక్రమాలకు సహకరిస్తున్న అందరికీ ధన్యవాదాలు అని తెలిపారు. అలానే శివుడి విగ్రహం ఎక్కడ పెట్టి ముందుండే నడిపిస్తున్న బత్తినేని శ్రీనివాసరావుకు మా కుటుంబం ఎప్పుడూ అండగా ఉంటుందని తెలియజేశారు. వెంకట కుమారి చేతులు మీదుగా అక్కడున్న భక్తులకు ప్రజలకు అల్పాహార పంపిణీ కార్యక్రమం నిర్వహించారు కార్యక్రమంలో పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు బత్తినేని శ్రీనివాసరావు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తేలప్రోలు రామ్మూర్తి, కొమరవెల్లిపాడు సొసైటీ మాజీ చైర్మన్ తోట బ్రహ్మ స్వాములు, బైరా శ్రీనివాసరావు, పురుషోత్తమ పట్నం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బైరా వెంకట కోటేశ్వరరావు,దేవి రెడ్డి భాస్కరరావు, దేవి రెడ్డి లక్ష్మీనారాయణ, అర్చకోల రవిచంద్ర, మేకల నాగరాజు, తోట కృష్ణమూర్తి, తోట శ్రీనివాసరావు, దేవి రెడ్డి చిరంజీవి, కొఠారి వెంకటేశ్వర్లు, నందం చంద్ర. కాజా, ఆర్టీసీ ప్రసాద్ తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పఠాన్ బ్రదర్స్ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా పంపిణీ

**చిలకలూరిపేట, మార్చి 16, ప్రభాతవార్త:** ముస్లిం సోదరులకు పవిత్ర పండుగ రంజాన్ అని, శాసనమండలి సభ్యులు మ్రరి. రాజశేఖర్ అన్నారు. సోమవారం ఉదయం పటాన్ బ్రదర్స్ నివాసం దగ్గర 1750 మంది నిరుపేదలకు 12 లక్షల విలువైన రంజాన్ తోఫా పంపిణీ (బియ్యం, నిత్యవసర సరుకులు మరియు నగదు)



కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన విచ్చేశారు. తొలుత రాజశేఖర్‌కు ఆరాధ్యుల రామకృష్ణ స్వాగతించి అనంతరం దువా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మ్రరి.రాజశేఖర్ మాట్లాడుతూ 1750 మంది నిరుపేదలకు రంజాన్ తోఫా పంపిణీ చేయడం (బియ్యం, నిత్యావసర సరుకులు) గొప్ప పరిణామం అని, ఇంతే కాక ఎవరైనా ఆర్థికంగా ఇబ్బంది ఉంటే, విద్య పరంగా, వైద్య పరంగా వాళ్ళు చేస్తున్న సేవలను కొనియాడారు. సేవగుణం గొప్పదని ఈరోజు సతామి సందర్భంగా వాళ్ళ తండ్రిని జ్ఞాపకార్థంగా వాళ్లు చేస్తున్న సేవలను కొనియాడారు. తదనంతరం గవర్నమెంట్ ఖాజీ అనాస్ ఖాన్ నద్వి, మాట్లాడుతూ నిరుపేదలకు రంజాన్ తోఫా పంపిణీ చేయడం చాలా గొప్ప పరిణామమని అన్నారు. ఈ కార్యక్రమంలో పఠాన్ చిన్న సత్తా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు పఠాన్ యూసుఫ్, పఠాన్ పెద్ద సుభాని, యాసిన్ అలాగే సనా కమిటీ సభ్యులు షేక్.నజీర్ అహ్మద్, ఇంకా మత పెద్దలు, వారిసిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా పొట్టిశ్రీరాములు జయంతి

**చిలకలూరిపేట, మార్చి 16, ప్రభాతవార్త:** అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవి ఫౌండేషన్ సొసైటీ, చిలకలూరిపేట ఆధ్వర్యంలో పట్టణంలోని పొట్టి శ్రీరాములు కాంప్లెక్స్ నందు గల అమరజీవి పొట్టి శ్రీరాములు గారి విగ్రహానికి పూలమాలలతో సత్కరించి, స్నాక్స్



పంపిణీ చేసి ఘనంగా జయంతి వేడుకలు జరిపారు. తెలుగు రాష్ట్ర ప్రజల కోసం వారు చేసినటువంటి 58 రోజుల ఆమరణ నిరాహార దీక్ష ఫలితమే ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం అని అధ్యక్షులు అయితా వెంకటప్రసాద్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ ప్రెసిడెంట్ అయితా వెంకటప్రసాద్, కార్యదర్శి మున్నలూరి వెంకట సుబ్బారాయుడు గుప్తా, కోశాధికారి శిఖాకొల్లి రామారావు, సహాయ కార్యదర్శి ఆత్మకూరి హైమారావు, సభ్యులు అన్నా కోటేశ్వరరావు, పెరుమాళ్ళ వెంకట సత్యనారాయణ రావు, శిఖాకొల్లి వీరభాస్కరరావు, గుంటూరు రోజారావు కాంప్లెక్స్ నందు గల వ్యాపార సంస్థల యజమానులు మరియు పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ కౌన్సిల్ హాలులో ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతిఅమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా చిలకలూరిపేట కౌన్సిల్ హాలులో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన చైర్మన్ రఫాని, మున్సిపల్ కమిషనర్ శ్రీహరి, వైస్ చైర్మన్ గోల్డ్ శ్రీను, వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మజ్జిగ పంపిణీ

**వట్టిచెరుకూరు, మార్చి16,ప్రభాతవార్త:** మండలంలో పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఉప్పుటూరి చిన్న రాములు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ



సందర్భంగా ఉప్పుటూరు చారిటబుల్ ట్రస్ట్ అధినేత చినరాములు మాట్లాడుతూ..ప్రతి సంవత్సరం మా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు పరీక్షా సామాగ్రితో పాటు పరీక్ష సమయంలో ఉచిత మజ్జిగ ప్యాకెట్లు అందిస్తున్నట్లు చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు మజ్జిగ ప్యాకెట్లు, అందించే కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. ఈ చొరవ విద్యార్థులకు, ముఖ్యంగా మధ్యాహ్నం సమయంలో పరీక్ష రాసేవారికి ఎంతో ఉపశమనం కలిగిస్తోందని తెలియజేసారు. మండలంలో అనంతవరప్పాడు, వట్టిచెరుకూరు, గారపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం పదో తరగతి పరీక్షలు రాస్తున్న 380 మంది విద్యార్థులకు పరీక్ష సామాగ్రితో పాటు, ఒక్కొక్క కేంద్రం వద్ద పరీక్షలు అయ్యేంతవరకు 150 మజ్జిగ ప్యాకెట్లు ఉచితంగా అందిం చనున్నట్లు వెల్లడించారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున విద్యార్థులు డీహైడ్రేషన్ బారిన పడకుండా ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. పరీక్షలకు వెళ్ళే ముందు విద్యార్థులు తగినంత నీరు తాగడం మరియు తేలికపాటి ఆహారం తీసుకోవడం మంచిదని చిన రాములు సూచించారు. పది పరీక్షలు ఎంతో ఒత్తిడితో కూడుకున్నవని, పరీక్షలు రాసి అలసిపోయి, పరీక్ష కేంద్రం నుంచి బయటకు వచ్చిన విద్యార్థులకు ఉప్పుటూరి చిన రాములు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ ప్యాకెట్లు అందించడం చాలా మంచి నిర్ణయం అని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందం, వివిధ పార్టీ నేతలు అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో విద్యార్థుల కోసం మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు.

# శాంతకుమార్‌ను సన్మానించిన న్యాయవాదులు

**సత్తెనపల్లి, మార్చి 16, ప్రభాతవార్త:** ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులుగా గుంటూరుకు చెందిన సీనియర్ న్యాయవాది జి.శాంతకుమార్ గెలుపొందటంతో సోమవారం గుంటూరులోని ఆయన స్వగృహంలో సత్తెనపల్లి కి చెందిన పలువురు న్యాయవాదులు ఘనంగా సన్మానించారు .



ఈసందర్భంగా శాంతకుమార్ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఎన్నో ఒత్తిళ్లు ఎదురైనా మీరు నాతో నిలబడి నాకు అండగా నిలి చారని, మీ మద్దతు వల్లే విజయం సాధ్య మైందన్నారు. మీ నమ్మకాన్ని ఎప్పటికీ గౌరవిస్తానని, న్యాయ వాదుల సంఘం అభ్యున్నతి కోసం కృషి చేస్తానని తెలిపారు. అనంతరం పలువురు న్యాయవాదులు శాలువాలు, పూల మాలతో శాంతకుమార్ ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఐఎల్ఎ సత్తెనపల్లి అధ్యక్షుడు చావ బాబురావు, సీనియర్ న్యాయవాదులు దాసరి జాన్ రాజ్ పాల్, పెండెం బాబురావు, ఉటుకూరు పాపరావు, జొన్నలగడ్డ విజయ్ కుమార్, మాదంశెట్టి వేదాద్రి, తురుమెళ్ల రాజ్ కుమార్, కాంట్రాక్టర్ కారుమంచి గంగరాజు తదితరులున్నారు.

# 'కథా పద్మాలు' ఆవిష్కరణ

**చిలకలూరిపేట, మార్చి 16, ప్రభాతవార్త:** సహృదయ కథా రచయిత్రి తాటి కోల పద్మావతి తన 'కథా పద్మాలు' కథల సంపుటిని ప్రముఖ సాహితీవేత్త, రంగస్థల, గిజు, సినిమా నటుడు, విడదల నీహారిక ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు విడదల సాంబశివరావుకు అంకితం చేశారు. పొత్తూరు గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా అమరావతి అభివృద్ధి సంస్థ అధ్యక్షులు జాస్తి



వీరాంజనేయులు హాజరయ్యారు. సాహితీ కిరణం..సాహిత్య మాసపత్రిక అధ్వర్యంలో పత్రిక సంపాదకులు పొత్తూరు సుబ్బారావు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీ వేత్త తూములూరి రాజేంద్రప్రసాద్ అధ్యక్షులు గా, ప్రముఖ సాహితీ వేత్త లు జెల్లి విద్యాసాగర్, పెద్దూరి వెంకటదాస్, వివి రాఘవరెడ్డి, సయ్యద్ జానీ బాషా. మోనశ్రీ మల్లిక్, దమయంతి, సాహితీ కిరణం బాధ్యులు పొత్తూరి జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో ప్రారంభమైన 10 పరీక్షలు

**వట్టిచెరుకూరు, మార్చి16, ప్రభాతవార్త :** రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం మండలంలో ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా



కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు మధ్య సజావుగా నిర్వహించారు. ప్రారంభమయ్యాయి. మండలంలో అనంతవరప్పాడు, వట్టి చెరుకూరు, గారపాడు జిల్లా పరిషత్తు హైస్కూల్లో పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. ఈ మూడు పరీక్ష కేంద్రాలలో 380 మంచి విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా అనంతవరప్పారులో ఒకరు, వట్టి చెరుకూరులో ఇద్దరు,గారపాడు లో ఒకరు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా పరీక్ష తనిఖీ అధికారులు మాట్లాడుతూ పరీక్షా కేంద్రాలలో విద్యార్థులు మొదటి రోజు కాస్త గందరగోళానికి గురయ్యారని, వారికి నంబర్లు రూములు కేటాయించడం కాస్త ఇబ్బంది పడటంతో వారినందరికి సర్దిచెప్పటం జరిగిందన్నారు. విద్యార్థులకు ఏ రూంలో పరీక్ష కేంద్రంలో పరీక్ష రాయాలో నంబరు గది పరీక్ష రాసే విద్యార్థులకు చూపించి వివరాలు తెలపటం విశేషం. పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసామన్నారు. మండలంలో జరుగుతున్న పరీక్షా కేంద్రాల వద్ద జిరాక్స్ సెంటర్లను మూయించామన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేశామన్నారు. విద్యార్థులు పరీక్షాలలో నిశ్శబ్ద వాతావరణంలో పరీక్షలు రాయటం గమనించామన్నారు. పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు తాగునీటి వసతి, వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాలలో డిపార్ట్మెంటల్ అధికారితో పాటు, చీఫ్ సూపరింటెంట్, ప్రతి ఇన్విజిలేటర్, సిట్టింగ్ స్క్వాడ్ ఎవరి విధులు వారు నిర్వర్తించారు. పరీక్షా కేంద్రంలోకి ఇన్విజిలేటర్లు సెల్ఫోన్లు అనుమతించలేదు. ప్రశ్న పత్రాలను పోలీస్ స్టేషన్ నుంచి తెచ్చిన తర్వాత రాష్ట్రం నుంచి ఏర్పాటు చేసిన మీటింగ్ లో చెప్పిన పేపర్ కోడ్ ను మాత్రమే విద్యార్థులకు ఇవ్వాలని సూచించారు. మొదటి రోజు తెలుగు పరీక్షకు మండల వ్యాప్తంగా 98.87 శాతం మంది పరీక్షకు హాజరయ్యారు. ప్రతి పరీక్ష కు ప్రభుత్వ సెలవు రోజులు ఉన్నాయని, ఆ సెలవుల్లో ఏడాది పాటు కష్టపడి చదివిన విద్యార్థి రివిజన్ చేసుకుని మంచి మార్కులు సాధించాలని అధికారులు సూచించారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి మంచి విజయాన్ని సాధించాలని ఆకాంక్షి ంచారు. పరీక్ష పూర్తయ్యే వరకు విద్యార్థులను బయటకు పంపించలేదు. హాల్ టికెట్ లేని విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించలేదు. మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్ లు, కాలిక్యులేటర్లు, బ్లూటూత్ పరికరాలు, మరియు ఇతర ఎలక్ట్రానిక్స్ గాడ్జెట్ లను పరీక్షా కేంద్రాల్లోకి తీసుకురాకుండా కట్టడి చేశారు. ఏది ఏమైనా మొదటి రోజు పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. పరీక్షలు రాసి కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థుల ముఖాల్లో బాగా రాసేమనే ఫీలింగ్ వ్యక్తం చేసారు.

# వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే కూటమి ప్రభుత్వ ధ్యేయం..

**వట్టిచెరుకూరు, మార్చి 16, ప్రభావతవార్త :** వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మర్రి సాంబశివరావు పేర్కొన్నారు. మండలంలోని పుల్లడిగుంట గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సోమవారం రైతన్న మీకోసం కార్యక్రమం



నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సాంబశివరావు పాల్గొని మాట్లాడుతూ..రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తోందన్నారు. అన్నదాతల ఆర్థిక భద్రత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ- పియమ్.కిసాన్ పథకం రైతులకు ఎంతో ఊరటనిస్తోందని వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు మూడు విడతలుగా ఒక్కో రైతు ఖాతాలో మొత్తం రూ.20వేలు ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం జమ చేసిందని వెల్లడించారు. ఈ నెల 13వ తేదీన మూడవ విడత కింద రూ.6,000 గన్నవరం నియోజకవర్గం వేదికగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేరుగా రైతుల ఖాతాల్లోకి చేశారని గుర్తుచేశారు. కేవలం ఆర్థిక సాయమే కాకుండా, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం బహుముఖ వ్యూహంతో ముందుకు వెళ్తోందని వివరించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియపై రైతులకు స్పష్టమైన అవగాహన కల్పించడంతో పాటు, ఖర్చు తగ్గించే ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలను కూడా రాయితీపై అందిస్తుందని, రైతులు వీటిని సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని కోరారు.ఎంఏఓ సునీత మాట్లాడుతూ రైతన్న మీకోసం వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా రైతుల సంక్షేమం, సమస్యల పరిష్కారం మరియు ప్రభుత్వ పథకాల అవగాహన, అన్ని గ్రామాల్లో రైతుల ఇళ్లకు వెళ్లి వివరించడం జరిగిందన్నారు. అలాగే నీటి భద్రత, డిమాండ్ ఆధారిత వ్యవసాయం, అగ్రిటెక్ వినియోగం, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం మద్దతు ప్రభుత్వం పథకాలు గురించి రైతులకు అవగాహన కల్పించారు. యాప్ ల వినియోగం, ఉపయోగాన్ని రైతులకు చూపించడం జరిగిందన్నారు. ఈపంట మరియు ఈకేవైసీ 202526 రబీపంట వివరాల గురించి రైతులకు తెలియజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది హారిక, కళ్యాణి, శ్రీలక్ష్మి, రైతులు నార్నె సాంబశివరావు, మానుకొండ రాజు, చిరుమామిళ్ల రంగారావు, మన్నవ శ్రీనివాసరావు, ఎడ్లపల్లి వీరప్రసాద్, నందిపాటి వెంకట్రావు,ఉప్పుటూరి పెదరాములు, ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# లండన్‌లో మెరిసిన తెలుగు తేజం

**-షటిల్ టోర్నీలో సత్తా చాటిన చేబ్రోలు సంతోష్**

**-23న బహుమతులు అందించనున్న లండన్ ప్రతినిధులు**

**-ప్రథమ బహుమతి అందుకోనున్న సంతోష్‌కు పట్టణ ప్రజల అభినందన**

చిలకలూరిపేట, మార్చి 16, ప్రభాతవార్త: లండన్ లో జరిగిన షటిల్ టోర్నీలో చేబ్రోలు సంతోష్ ఘన విజయం సాధించారు. చిలకలూరిపేట పట్టణంలో మోడరన్ విద్యా




సంస్థలు ఏర్పాటు చేసి ఎంతో మంది విద్యార్థులు ను భావి భారత పౌరులు గా తీర్చి దిద్దుతున్నా విద్యా సంస్థలు చైర్మన్ చేబ్రోలు మహేష్ తనయుడు ఈ చేబ్రోలు సంతోష్ లండన్ లో గితిళీ ఆధ్వర్యంలో ఓపెన్ షటిల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నీలో చేబ్రోలు సంతోష్ పాల్గొన్నారు. మేన్స్ విభాగం లో జరిగిన పోటీలో సంతోష్ కు సింగిల్, డబుల్స్ లో విజయం సాధించి ప్రథమ స్థానం కైవసం చేసుకున్నాడు .ప్రథమ స్థానం కైవసం చేసుకున్న చేబ్రోలు సంతోష్ ను గితిళీ ప్రతినిధులు అభినందించారు. వీరికి ఈ నెల 23న బహుమతులు అందజేయనున్నారు. లండన్ లో జరిగిన షటిల్ టోర్నీలో చిలకలూరిపేట వాసికి రెండు విభాగాల్లో ప్రథమ స్థానం దక్కడం హర్షింప తగ్గ విషియం....ఈ సందర్భంగా చిలకలూరిపేట లోని పలువురు ప్రముఖులు చేబ్రోలు సంతోష్ ను ఘనంగా అభినందనలు తెలిపారు.సంతోష్ తో పాటు మోడరన్ విద్యా సంస్థల చైర్మన్ మహేష్ ను కూడా అభినందించారు.

